116 మంది సింగరేణి కార్మికులు అన్‌ఫిట్

కొత్తగూడెం సింగరేణి: సింగరేణి ప్రధానాసుపత్రిలో శుక్రవారం జరిగిన మెడికల్ బోర్డులో 116 మంది కార్మికులను వైద్యపరంగా అన్‌ఫిట్‌గా ప్రకటించారు. మొత్తం 204 మంది బోర్డుకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో గురువారం 179 మంది హాజరై వైద్యపరీక్షలు చేయించుకున్నారు. పరీక్షల ఫలితాలను హైదరాబాద్ నుంచి వచ్చిన వైద్యనిపుణులు పరిశీలించి.. విధులకు అనర్హులైన వారిని ప్రకటించారు. మిగిలిన వారిలో కొందరిని రిఫరల్‌కు పంపగా, కొందరు విధులకు అర్హులని ప్రకటించారు.


ఈనాడు భద్రాద్రి కొత్తగూడెం

శనివారం అక్టోబరు 26, 2024

సమాజమంటే సంపదే కాదు.. సంస్కృతి

● గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాల ప్రజలకు అందేలా చూడాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. శుక్రవారం ఉదయం భద్రాచలం రాములోరి దర్శనం అనంతరం కలెక్టరేట్‌లో జరిగే సమావేశానికి విచ్చేసిన గవర్నర్‌కు కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఐటీడీఏ పీఓ రాహుల్, ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాంనాయక్, కొత్తగూడెం, భద్రాచలం ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, తెల్లం వెంకట్రావు, సీనియర్ అటవీ శాఖాధికారి కిష్టాగౌడ్, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన స్వాగతం పలికారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో గవర్నర్ మాట్లాడారు. భద్రాద్రి జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరు బాగుందని కితాబిచ్చారు. 2021లో 73 శాతం ఉన్న రక్తహీనత బాధిత చిన్నారులు, గర్భిణుల సంఖ్యను నాలుగేళ్లలో 21 శాతానికి తగ్గించడం అభినందనీయమన్నారు. 'స్వచ్ఛ భారత్'లో భాగంగా అన్ని పంచాయతీలను బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. గిరిజనులు ఎక్కువగా ఉన్న జిల్లాను దారిద్ర్య రేఖ దిగువ నుంచి పైకి తీసుకొచ్చేందుకు, మహిళా సాధికారతకు ప్రజాప్రతినిధులు, రచయితలు, కళాకారులు సహకారం అందించాలని కోరారు. జిల్లా వైద్య, విద్య రంగాలు మెరుగ్గా ఉన్నాయని, పదిలో 92 శాతం ఉత్తీర్ణత అభినందనీయమన్నారు. విద్యార్థులకు చేతి వృత్తి నైపుణ్యాలను నేర్పించాలన్నారు. సమాజమంటే సంపదే కాదని.. సంస్కృతి అని గవర్నర్ అన్నారు. జిల్లాలో నదులు, అటవీ సంపద, బీపీఎల్, కేటీపీఎస్, అశ్వాపురం హెవీవాటర్ ప్లాంట్, సింగరేణి బొగ్గు గనులు నెలకొని ఉన్నాయని.. వాటిద్వారా నిరుద్యోగులకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. భద్రాచలం, పర్ణశాలను పర్యాటకంగా అభివృద్ధి పరచాలన్నారు. కొండరెడ్ల అభ్యున్నతిపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధచూపాలని సూచించారు. అంతకుముందు ప్రభుత్వ పథకాల అమలుపై కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.



మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



సమావేశంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎంపీ బలరాంనాయక్, గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఎంపీ రఘురాంరెడ్డి , కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్, డీఎఫ్ఓ కిష్టాగౌడ్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్

అవార్డుల గ్రహీతలతో మాటామంతీ

వివిధ రంగాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్న వారితో గవర్నర్ మాట్లాడారు. ఆయన్ను కలిసిన వారిలో డా. ప్రభుదయాళ్ (రచయిత), సీతాప్రసాద్ (క్లాసికల్ డ్యాన్సర్), రావి వెంకటయ్య (ప్రకృతి ప్రేమికులు), కొండేటి విజయ్‌కుమార్ (సినీ దర్శకుడు), నుర్వి రాజశేఖర్ (పర్యావరణ ప్రేమికుడు), పి.అంజన్‌కుమార్ (ఆర్టిస్ట్), వెంకటలక్ష్మి (శానిటరీ న్యాప్కిన్, చిరుధాన్యాల తయారీ), మోడెం వంశీ (పవర్ లిఫ్టర్), అల్లి శంకర్, వి.కొండలరావు, డాక్టర్ బుచ్చయ్య (గాయకులు), టి.శ్రీతేజ (జాతీయ అథ్లెట్), బట్టు శ్వేత (వెయిట్ లిఫ్టర్, శ్రీరాంశెట్టి కాంతారావు, అంగోతి శ్రీనివాసరావు (పద్య కవులు), పి.రోశయ్యచౌదరి (గాయకుడు), వి.భాస్కర్ (పాటల రచయిత), బి.రిత్వికశ్రీ (బ్యాడ్మింటన్ క్రీడాకారిణి), స్నేహ (జానపద గాయని) దిలావర్, సోంపాక సీత, ఎస్.ప్రభాకరాచార్యులు, తాతోలు దుర్గాచారి, తురిమెళ్ల కళ్యాణి, ఎస్.కృష్ణమూర్తి, నాగ రాజశేఖర్, (రచయితలు, సాహితీవేత్తలు) ఉన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసి స్టాల్స్ అటవీ ఉత్పత్తులను గవర్నర్ సందర్శించారు. ఐఏఎస్ అధికారి, గవర్నర్ ముఖ్య కార్యదర్శి బి.వెంకటేశం పాల్గొన్నారు.

◆ జిల్లా పర్యటనకు వచ్చిన గవర్నర్‌కు ఎంపీలు, ఎమ్మెల్యేలు కృతజ్ఞతలు తెలిపారు. విమానాశ్రయం ఏర్పాటుకు సహకారం అందించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కోరారు.



గవర్నర్‌కు రాములవారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ రమాదేవి

ధాన్యం సేకరణకు కసరత్తు ముమ్మరం



సర్కారు గుర్తించిన సన్నరకం వంగడాలు..

- సాంబమసూరి (బీపీటీ-5204)
- హెచ్ఎంటీ సోనా
- కూనారం వరి (కేఎన్ఎం-1638)
- కూనారం వరి-1 (కేఎన్ఎం-733)
- జగిత్యాల మసూరి (జేజీఎల్-11470)
- జగిత్యాల వరి-2 (జేజీఎల్-28545)
- జగిత్యాల వరి-3 (జేజీఎల్-27356)
- మానేరు సోనా (జేజీఎల్-3828)
- జగిత్యాల సన్నాలు (జేజీఎల్-1798)
- జగిత్యాల సాంబ (జేజీఎల్-3844)
- జగిత్యాల సాంబ (జేజీఎల్-3855)
- పొలాస ప్రభ (జేజేఎల్-384)
- కరీంనగర్ సాంబ (జేజీఎల్-3855)
- అంజన (జేజీఎల్-11118)
- ప్రత్యుమ్న (జేజీఎల్-17004)
- జేజీఎల్-33124(పీఆర్సీ)
- తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్-15048)
- ఆర్ఎన్ఆర్-31379 (పీఆర్సీ)
- కృష్ణ (ఆర్ఎన్ఆర్-2458)
- సుగంధ సాంబ (ఆర్ఎన్ఆర్-2465)
- శోభిని (ఆర్ఎన్ఆర్-2354)
- రాజేంద్రనగర్ వరి-4 (ఆర్ఎన్ఆర్-21278)
- వరంగల్ సాంబ (డబ్ల్యూజీఎల్-14)
- వరంగల్ సన్నాలు (డబ్ల్యూజీఎల్-32100)
- వరంగల్ వరి-1119
- వరంగల్ వరి-2 (డబ్ల్యూజీఎల్-962)
- సోమనాథ్ (డబ్ల్యూజీఎల్-347)
- కేపీఎస్-6251 (పీఆర్సీ)
- ఎంటీయూ-1271
- నెల్లూరు మసూరి (ఎన్ఎల్ఆర్-34449)
- మార్టేరు సాంబ (ఎంటీయూ-1224)
- మార్టేరు మసూరి (ఎంటీయూ-1262)
- సిద్ధి (డబ్ల్యూజీఎల్-44)

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం

వానాకాలం ధాన్యం సేకరణకు అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తామని ముందస్తుగా ప్రకటించటంతో సన్నాల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో 4,45,703 ఎకరాల్లో వరి పంట సాగవగా ఇందులో 4,17,681 (93.71శాతం) ఎకరాల్లో సన్నాలే కావటం గమనార్హం. 483 కొనుగోలు కేంద్రాల ద్వారా 7.18లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని అధికారులు నిర్ణయించారు. గన్నీ సంచులు, టార్పాలిన్ పట్టాలను ఆయా కేంద్రాలకు తరలిస్తున్నారు. కనీస మద్దతు ధర క్వింటాకు ఏ-గ్రేడ్ రకానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 ప్రభుత్వం చెల్లించనుంది. ఖమ్మం జిల్లాలో వరి కోతలు మొదలైనచోట్ల 34 కేంద్రాల ద్వారా ధాన్యం సేకరిస్తుండగా.. భద్రాద్రి జిల్లాలో కోతలు మొదలవలేదు.

ప్రత్యేక యంత్రాలు.. తీరొక్క రంగులు

బోనస్ వర్తించే 33 రకాల సన్నాలను ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. వీటి గుర్తింపునకు 'ప్యాడి హస్కల్', 'గ్రెయిన్ కాలిపర్' యంత్రాలను అధికారులు ఉపయోగించనున్నారు. మొదటగా గుప్పెడు వడ్లను తీసుకుని 'ప్యాడి హస్కల్'లో పోసి తిప్పితే పొట్టు ఊడిపోయి బియ్యం గింజలు బయటకొస్తాయి. 'గ్రెయిన్ కాలిపర్' ద్వారా ఇవి సన్నాలో కాదో తెలుసుకోవచ్చు. సన్నవడ్ల బస్తాలను ఎరుపు రంగు, దొడ్డు రకాలను ఆకు పచ్చ రంగుతో కోడ్ చేయనున్నారు.

వరి కోతలు మొదలైన ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నాం. ఇప్పటికే 34 కేంద్రాల ద్వారా ధాన్యం సేకరిస్తున్నాం. సన్న రకాల సేకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

- చందన్‌కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి, ఖమ్మం



	వరి సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	కొనుగోలు కేంద్రాలు	ధాన్యం సేకరణ లక్ష్యం (మెట్రిక్ టన్నుల్లో)
ఖమ్మం	2,82,014	323	4.26 లక్షలు
భద్రాద్రి	1,63,689	160	2.92 లక్షలు

కార్మికోద్యోగుల కుటుంబాల్లో..
దీపావళి బోనస్ వెలుగులు

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే

లబ్ధిపొందిన కార్మికులు..	
కార్పొరేట్ కార్యాలయం:	1,630
కొత్తగూడెం ఏరియా:	2,622
ఇల్లెందు ఏరియా:	668
మణుగూరు..	2,547

దీపావళి కానుగా పేర్కొనే 'పెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్ (పీఎల్ఆర్)' బోనస్‌ను సింగరేణి యాజమాన్యం ఉద్యోగుల ఖాతాల్లో శుక్రవారం జమచేసింది. పీఎల్ఆర్ బోనస్ ఎంత ఇవ్వాలనేది దిల్లీలో గతనెల 29న జరిగిన చర్చల్లో జాతీయ సంఘాల నాయకులు, కోలిండియా, సింగరేణి యాజమాన్యాలు నిర్ణయించిన విషయం తెలిసిందే. పీఎల్ఆర్ బోనస్‌ను కోలిండియా తన కార్మికులకు దసరా సమయంలోనే చెల్లిస్తోంది. కానీ, సింగరేణిలో మాత్రం దీపావళికి ముందస్తుగా విడుదల చేస్తున్నారు. గత సంవత్సరం రూ.85,500 చెల్లించగా, ఈ ఏడాది రూ.93,750 చెల్లించారు. దసరాకు ముందు యాజమాన్యం లాభాల్లో వాటాను చెల్లించిన విషయం తెలిసిందే. దీపావళి బోనస్‌తో దేశంలోని కోలిండియా సంస్థల్లో పని చేసే సుమారు 2.5 లక్షలు, సింగరేణిలో సుమారు 42 వేల మంది ఉద్యోగులకు లబ్ధికలిగింది. బోనస్ అందుకున్న వారిలో ఉభయ జిల్లాల్లో 7,467 మంది కార్మికులు ఉన్నారు. పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

◆ "వెలుగుల పండుగను ఉద్యోగులు సంతోషంగా జరుపుకోవాలి. సంస్థ బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించే దిశగా కృషిచేయాలి" అని ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం ఆకాంక్షించారు.



ప్రసాద్ పనులు పూర్తయితే పర్యాటక శోభ

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం రామాలయం, పర్ణశాలలో పిలిగ్రిమేజ్ రెజువెనేషన్ అండ్ స్పిరిచ్యువల్ ఆగ్యుమెంటేషన్ డ్రైవ్ (ప్రసాద్) పథకంలో భాగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇవి చురుగ్గా సాగితేనే 2025 మార్చి- ఏప్రిల్‌లో జరిగే శ్రీరామనవమి ఉత్సవాలకు పూర్తిస్థాయిలో నిర్మాణాలు అందుబాటులోకి వస్తాయని ఆలయాధికారులు భావిస్తున్నారు. అంతకుముందే కొన్ని కట్టడాలు ఉపయోగంలోకి వస్తాయని అంచనా వేస్తున్నా.. ఇందుకు నిరంతర పర్యవేక్షణతో పాటు ప్రగతిపై ఉన్నత స్థాయి సమీక్షలు అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 'ప్రసాద్' పథకంలో భాగంగా రాష్ట్రానికి రూ.92.04 కోట్లు మంజూరైన విషయం విదితమే. రూ.41.38 కోట్లతో భద్రాచలం, పర్ణశాల రామక్షేత్రాల అభివృద్ధి పనులకు వర్చువల్‌గా 2022 డిసెంబరు 28న రాష్ట్రపతి ద్రౌపదీముర్ము శంకుస్థాపన చేశారు. ఇవి ఇప్పుడు వివిధ దశల్లో నిదానంగా సాగుతున్నాయి.

సకాలంలో పనులు పూర్తిచేయాలని గుత్తేదారులకు సూచించాం. నాలుగు నెలల్లో వీటన్నింటినీ అందుబాటులోకి తీసుకొస్తాం.

- ప్రసాద్, ఏఈ, ప్రసాద్ పథకం

రాముడు తిరిగిన ఊరిది..!

రాములవారు వనవాసం సమయంలో పర్ణశాలలో నివాసం ఉండి భద్రాచలంలో పర్యటించాడు. ఆతర్వాత కాలంలో ఇక్కడ కొలువై దర్శనమిస్తున్నాడు. ఇలాంటి పుణ్యక్షేత్రాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి పరచాలని ప్రభుత్వం నిర్ణయించింది. రూ.60.20 కోట్లతో మాడవీధుల విస్తరణ సర్వే పనులు పూర్తయితే ఆలయ సమీపంలోని ఇళ్లను తొలగించి బాధితులకు పరిహారం చెల్లించాలి. ఇంటి నిర్మాణాలకు స్థలం కేటాయింపుపై స్పష్టతనివ్వాలి. ఇప్పుడున్న సత్రాలు తక్కువ మందికే సరిపోతున్నాయి. ఒకేసారి 1,000 మంది భక్తులకు వసతి కల్పించాలంటే కుదరటం లేదు. ఆస్థాయిలో స్థలాలు సేకరించాలి. రాములవారికి పురుషోత్తపట్నంలో ఉన్న భూముల్లో నిర్మాణాలు చేపట్టాలంటే సరిహద్దు సమస్యను పరిష్కరించాలి. ముక్కోటి ఏకాదశి మహోత్సవం నాటికి అభివృద్ధి పనులపై స్పష్టత వస్తుందని భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



శిల్పకళతో ఏర్పాటు కానున్న స్వాగత ద్వారం (నమూనా చిత్రం)

ఆధ్యాత్మికత ఉట్టిపడాలంటే..

- ప్రధానాలయం, రాజగోపురం నిత్యం విద్యుద్దీపాలతో కళకళలాడుతుండాలి. యాత్రికుల సౌకర్యార్థం వ్రత మండపం, ప్రసాదాల కౌంటర్లను విస్తరించాలి. రూఫింగ్, ఫ్లోరింగ్, బారికేడ్లను నిర్మించాలి.
- కోవెల పరిసరాల్లోని అప్రోచ్ దారులు, స్వాగత ద్వారాలు, నడక మార్గాలు, సేద తీరేందుకు బల్లలు, షెల్టర్స్, బయో టాయిలెట్లు, దుస్తులు మార్చుకునే సదుపాయం ఉండాలి.
- నదీ విహారానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి. గోదావరి వద్ద పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి.
- వాహనాల పార్కింగ్ ప్రదేశం, వాష్ రూమ్స్, క్యాంటీన్ కాంప్లెక్స్, సీసీ టీవీ వ్యవస్థ, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయాలి.
- పర్ణశాల వద్ద వీధిలో దీపాలతో పాటు స్తంభాలు, క్యూలైన్లు, ఫ్లోరింగ్, బయో టాయిలెట్లు, గోదావరిలో బోట్ షికారు సౌకర్యం కల్పించాలి. ఫుట్ బ్రిడ్జి, దుకాణాలు, వసతి సదుపాయాలు అవసరం. సమాచార బోర్డులు తప్పనిసరి. వీటిలో అధిక భాగం పనులు ప్రసాద్ పథకంలోనే ఉన్నాయి. త్వరగా పూర్తిచేస్తే రాములోరి సన్నిధికి మరింత శోభ వస్తుంది.

నవంబరు 7 నుంచి 'చెకుముకి సంబరాలు'

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నవంబరు 7, 11, 24 తేదీల్లో చెకుముకి ప్రతిభ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వరరావు తెలిపారు. గోడ పత్రికను కలెక్టర్ జితేశ్ వి పాటిల్ శుక్రవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేవీవీ నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే లక్ష్యంగా 'చెకుముకి సంబరాలు' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల స్థాయిలో ప్రతిభచూపిన వారికి 21న మండలం, 28న జిల్లా, డిసెంబరు 14-16 వరకు రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయని వెంకటేశ్వరరావు చెప్పారు. సభ్యులు రమేష్‌కుమార్ మక్కడ్, వీరభద్రం, మోహన్‌రావు, నాగేశ్వరరావు, బాబూరావు పాల్గొన్నారు.

కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలతో
కుడా ఆవిర్భావం



● అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీగా ప్రకటించిన ప్రభుత్వం

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలు, పరిసర గ్రామాలతో 'కొత్తగూడెం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా)'ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీనికి సంబంధించిన జీవో నంబరు 177ను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్ శుక్రవారం జారీ చేశారు. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల సమగ్ర అభివృద్ధి కోరుతూ పలుమార్లు చేసిన విజ్ఞప్తులతో ఈ నిర్ణయాన్ని సర్కారు వెలువరించింది. జంట పట్టణాలతో పాటు జిల్లా కేంద్రానికి ముఖద్వారంగా చెప్పుకొనే సుజాతనగర్ గ్రామాన్నీ అర్బన్ అథారిటీ పరిధిలోకి చేర్చడం విశేషం. 'కుడా' ఏర్పాటుపై కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పందించారు. ఉత్తర్వుల ప్రతులను ఆయన విలేకరులకు అందజేశారు. "కుడా' ఏర్పాటు సంతోషదాయకం. ఇక జంట పట్టణాలు, నియోజకవర్గం అనతికాలంలోనే ఊహించని విధంగా అభివృద్ధిని సాధిస్తాయి. పారిశ్రామికంగా మరింత పురోగతిని సాధించడం చూడవచ్చు. తద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. పలుమార్లు చేసిన అభ్యర్థనతో స్పందించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు' అని ఈ సందర్భంగా కూనంనేని అన్నారు.

30న పెద్దమ్మ సన్నిధిలో రుద్రహోమం

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: పెద్దమ్మ తల్లికి పంచామృతాభిషేకాన్ని అర్చకులు శుక్రవారం వైభవంగా జరిపించారు. తొలుత అమ్మవారికి పంచామృతాలు, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం అభిషేకం, పంచహారతులు, నివేదన, నీరాజన మంత్రపుష్పం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈవో ఎన్.రజనీ కుమారి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ నెల 30న ఆలయ యాగశాలలో రుద్రహోమం నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు.



పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం

కేటీపీఎస్ 8వ దశ కర్మాగారం సాధనకు పోరాటం

పాల్వంచ, న్యూస్‌టుడే: పాల్వంచ కేటీపీఎస్‌లో ఎనిమిదో దశ సూపర్ క్రిటికల్ విద్యుత్తు కర్మాగారాన్ని నిర్మించే వరకు పోరాటం చేస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కేటీపీఎస్ ఐదు, ఆరు దశల ఎస్ఈ కాటం సంజీవయ్య ఆత్మీయ సన్మాన సభను కేటీపీఎస్ ఇంజినీరింగ్ అసోసియేషన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంపీ బలరాంనాయక్, రాష్ట్ర అటవీ శాఖ ఛైర్మన్ పొదెం వీరయ్య, ఎమ్మెల్సీ కోదండరాం, కేటీపీఎస్, బీటీపీఎస్ సీఈ, టీజీ జెన్కో సీఈలు ప్రభాకర్‌రావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్‌బాబు, బిచ్చన్న, టీఎస్ఎన్ మూర్తి, రత్నాకర్, విశ్రాంత సీఈ సిద్ధయ్య, టీపీసీసీ సభ్యుడు నాగసీతారాములు, ఖమ్మం డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ఇంజినీరింగ్, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొని సంజీవయ్య దంపతులను సత్కరించారు. అతిథులు మాట్లాడుతూ సంజీవయ్య అందించిన సేవలను కొనియాడారు.



ఎస్ఈ సంజీవయ్యను సత్కరిస్తున్న ఎమ్మెల్యే సాంబశివరావు

మున్నేరుతో కష్టాలు బారెడు..!

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం

ప్రజల కష్టాలను తీర్చాల్సిన పాలకులు పట్టించుకోవటం లేదు. ఏటా కురుస్తున్న వర్షాలకు కొత్తగూడెం-లక్ష్మీదేవిపల్లి మండలాల మధ్య ప్రవహిస్తున్న ముర్రేడు ఉగ్రరూపానికి.. పరీవాహక ప్రాంతంలోని అనేక ఇళ్లు నదిలో కలిసిపోయాయి. పాలకుల నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం వెరసి ముర్రేడు ముంపు ప్రాంతాల ప్రజలు వర్షాకాలంలో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. వచ్చే వానాకాలం నాటికైనా వరద ముంపు నుంచి తప్పించాలని కోరుతున్నారు.

శంకుస్థాపనకే పరిమితం

జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణాన్ని చీల్చుకుంటూ ముర్రేడు వాగు ప్రవహిస్తుంది. దీని వెంట వందల సంఖ్యలో నివాసగృహాలతో పాటు విద్యాసంస్థలు, సినిమా థియేటర్లు, వివిధ మతాల ప్రార్థనాలయాలు ఉన్నాయి. నదీ తీరాన్ని ఆనుకొని ఉన్న కట్టడాలు ఏటా వర్షాలకు పదుల సంఖ్యలో నీటిపాలవుతున్నాయి. బాధిత కుటుంబాలకు తీరని నష్టం వాటిల్లుతోంది. అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటికే సుమారు 40కిపైగా ఇళ్లు ముర్రేడులో కలిసిపోయాయి. నది కోతలతో తలెత్తుతున్న ఇబ్బందులను తొలగించేందుకు భారాస ప్రభుత్వం వాగుకు ఒకవైపు రక్షణ గోడ నిర్మించేందుకు రూ.33.50కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. 2023 శాసనసభ ఎన్నికల ముందు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి నాటి పాలకులు శంకుస్థాపన చేశారు.



గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసిన శిలాఫలకం

ప్రభుత్వం మారటంతో మళ్లీ మొదటికి..

రాష్ట్రంలో ప్రభుత్వం మారటంతో ముర్రేడు రక్షణ గోడ నిర్మాణం మళ్లీ మొదటికొచ్చింది. గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసినా నిధుల మంజూరు విషయంలో ఆర్థికశాఖ నుంచి పరిపాలన అనుమతులు జారీ కాలేదు. అందుకే పనులు మొదలవలేదు. తదనంతరం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. కాంగ్రెస్ సర్కారు కొలువుదీరి పదకొండు నెలలు కావొస్తున్నా ముర్రేడు రక్షణ గోడ పనులు ముందుకు సాగటం లేదు. ఈఅంశాన్ని స్థానిక నాయకులు పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రతిపాదనల దశ దాటడం లేదు.

పాలకులు దృష్టి సారిస్తేనే..

తొలుత రూపొందించిన రక్షణ గోడ నిర్మాణానికి బదులుగా జిల్లాలోనే తొలిసారి ప్రయోగాత్మకంగా గాబ్రియన్ వాల్ నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 1.60 కి.మీ పొడవున గోడ నిర్మించాలని నిర్ణయించారు. ఆర్థికశాఖ పరిపాలన అనుమతులిచ్చి నిధులు మంజూరు చేస్తే పనులు ప్రారంభించేందుకు అవకాశముంటుంది. ఇందుకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవ చూపాలని ముర్రేడు ముంపు బాధితులు కోరుతున్నారు.

వర్షాకాలం వచ్చిందంటే భయంభయంగా కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. ఇప్పటికే కాలనీలో అనేక ఇళ్లు ముర్రేడు ప్రవాహానికి కొట్టుకుపోయాయి. రక్షణ గోడ నిర్మిస్తామని పాలకులు ఇస్తున్న హామీలు నీటి మూటలవుతున్నాయి. వచ్చే వానాకాలం నాటికైనా రక్షణ గోడ నిర్మించాలని కోరుతున్నాం.

- దామోదర్ మోహనకృష్ణ, ఉపేంద్ర కాలనీ

ముర్రేడు రక్షణ గోడ నిర్మాణ ప్రతిపాదనలు, డిజైన్‌ను ప్రభుత్వానికి పంపించాం. పరిపాలన అనుమతులు, నిధులు మంజూరవగానే టెండర్ ప్రక్రియ చేపడతాం.

- రవికుమార్, డిప్యూటీ సీఈ, జలవనరుల శాఖ, కొత్తగూడెం

గురువుల 'చేతిలో' విద్యార్థుల ఆరోగ్యం..

పెనుబల్లి, న్యూస్‌టుడే

బాలబాలికల్లో లోపాల గుర్తింపునకు ప్రత్యేక యాప్

విద్యార్థి ఆరోగ్యంగా ఉంటేనే చదువుకోగలుగుతారు. అప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుంది. సహజంగా బాలబాలికల్లో శారీరక, మానసిక సమస్యలుంటాయి. కొందరు గుర్తించలేని లోపాలు, అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతుంటారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులే విద్యార్థుల్లో ఆరోగ్యపరమైన లోపాలను గుర్తించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రిసోర్స్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) ఆధ్వర్యంలో 'ప్రశస్త' పేరుతో ప్రత్యేక యాప్ రూపొందించింది.

21 రకాల లోపాలు గుర్తింపునకు..

విద్యార్థుల్లో చదవడం, వినడం, మాట్లాడటంలో ఇబ్బందితోపాటు చెప్పిన పదాన్ని పదేపదే చెప్పమనడం, రోజువారీ పనులు సొంతంగా చేసుకోలేకపోవడం, అనుమతి లేకుండా తరగతి నుంచి వెళ్లడం, నెమ్మదిగా చదవడం, రాయడం, స్పష్టత లేని చేతిరాత, రివర్స్‌గా రాయడం, గణిత చిహ్నాలు అర్థం చేసుకోవడంలో ఇబ్బంది, పునరావృత ప్రదర్శనలో ఇబ్బందులు, ఆసక్తిగా లేకపోవడం, చెప్పిందే చెబుతూ ప్రతిస్పందించడం, విచారంగా కనిపించటం, ఇతర విద్యార్థులతో పోలిస్తే సులభంగా అలసిపోవడం తదితర 21 రకాల లోపాల్లో దేనితో ఇబ్బంది పడుతున్నారో ఉపాధ్యాయులు తమ ప్రత్యక్ష పరిశీలనతో నమోదు చేస్తారు.



పెనుబల్లి మండల వనరుల కేంద్రంలో శిక్షణ కార్యక్రమంలో ప్రశస్త యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటున్న ఉపాధ్యాయులు

రెండు విభాగాలుగా..

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల వివరాలను నమోదు చేసే ప్రశస్త యాప్‌ను రెండు భాగాలుగా విభజించారు. కొన్ని ప్రశ్నలు ఉపాధ్యాయులడిగి తెలుసుకోవాలి. మరికొన్నింటిని వారే నిశితంగా పరిశీలించి నమోదు చేయాలి. యాప్‌లో 63 రకాల ప్రశ్నలకు సమాధానాలు పొందుపర్చాలి. పార్ట్-1లో లోపాలు గుర్తిస్తే, పార్ట్-2లో ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల లోపాలను ఉపాధ్యాయులు పరిశీలించి నిర్ధారించి వైద్యులకు సిఫార్సు చేస్తారు.

ఇదీ ఉద్దేశం

ప్రభుత్వ విద్యాలయాల్లో 0-18 ఏళ్లలోపు వారి వైకల్యాలను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి వారికి అవసరమైన చికిత్స, సదుపాయాలు కల్పించాలన్న లక్ష్యంతో 'ప్రశస్త' తెరపైకి తెచ్చారు. ఉపాధ్యాయుల సాయంతో వైకల్యాలున్న పిల్లలను గుర్తించి సమగ్ర విద్యను అందించడం ముఖ్య ఉద్దేశం.

ఉపాధ్యాయులు చేయాల్సిందిదీ..

ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రశస్త యాప్‌ను తమ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని ఉపాధ్యాయుని పేరు, ట్రెజరీ ఐడీ, మెయిల్ ఐడీ, సెల్ నంబర్, యూడైస్ కోడ్‌తో లాగిన్ కావాలి. అనంతరం యాప్‌లో సూచించిన విధంగా వివరాలు నమోదు చేయాలి.

ఉమ్మడి ఖమ్మం

మొత్తం పాఠశాలలు, కళాశాలలు: 2077

సిబ్బంది: 3,821 మంది ఉపాధ్యాయులు, 48 మంది ప్రత్యేక విద్యా బోధకులు.

ఇప్పటివరకు (ఈ నెల 21 వరకు) నమోదైన విద్యార్థులు: 8044

నమోదు చేశాక...

'ప్రశస్త' ద్వారా విద్యార్థుల వైకల్యాలను గుర్తించాక.. ఆయా పాఠశాలల్లో తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహిస్తారు. సమస్యల వివరాలను వారితో చర్చిస్తారు. సంబంధిత వైకల్యం ఆధారంగా వైద్య ధ్రువీకరణ పత్రం(సదరం) కోసం దరఖాస్తు చేయాలి. 40శాతం కంటే ఎక్కువ ఉన్నవారికి ప్రభుత్వపరమైన రాయితీలు పొందేందుకు అర్హత పొందుతారు. పాఠశాల స్థాయిలోనే ప్రత్యేక పరికరాలు, వైద్య సాయం అందేలా చర్యలు తీసుకుంటారు.



తల్లిదండ్రులతో పోల్చితే ఉపాధ్యాయులు విద్యార్థుల లోపాలను సులువుగా గుర్తించే అవకాశముంది. ప్రశస్త ద్వారా విద్యార్థుల స్క్రీనింగ్ సాధ్యమవుతుంది. ఉపాధ్యాయులందరూ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని, సాధ్యమైనంత తొందరగా స్క్రీనింగ్ చేయాలి. ఈ నెల 26 వరకు మొదటి దశ పూర్తవుతుంది.

రాజశేఖర్, సహిత విద్య జిల్లా సమన్వయకర్త, సమగ్ర శిక్ష, ఖమ్మం

అతడే.. ఓ సైన్యం!

☆ ఉద్యోగార్థులు, విద్యార్థులకు హేమంత్ ఫిట్‌నెస్ శిక్షణ

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే

ఆయన బీటెక్ పట్టభద్రుడు. ఖాకీ కొలువు సాధించాలనేది కల. అందుకు శారీరక దారుఢ్యం ముఖ్యం. కఠోర శ్రమతో ఫిట్‌నెస్‌పై పట్టు సాధించిన తీరు అద్భుతం. ఆ మెలకువలను తోటి యువతకు నేర్పిస్తూ మైదానంలో మరుగున పడిపోకుండా కదిలేలా ప్రోత్సహిస్తున్నారు. ఆయన తన యువతతో కదిలిస్తుంటే.. 'అతడే ఓ సైన్యం' అనిపిస్తుంది.


కొత్తగూడెం శ్రీనగర్‌కాలనీకి చెందిన 26 ఏళ్ల హేమంత్ తండ్రి లోక్‌నాథ్ గ్రామీణ వైద్యుడు. ఆయన 2017లో అనారోగ్యంతో మృతిచెందారు. హేమంత్ తల్లి రమాకుమారి టేకులపల్లి పీహెచ్‌సీలో ఏఎన్ఎం. బీటెక్ పూర్తిచేసిన హేమంత్ పోలీస్ శాఖలో ఎస్సై ఉద్యోగమే లక్ష్యంగా సన్నద్ధమవుతున్నారు. ప్రతిరోజు తెల్లవారుజామున స్థానిక ప్రగతి మైదానానికి వెళ్లి కసరత్తులు చేస్తుంటారు. శారీరక దారుఢ్య పరీక్షలకు సంబంధించిన పలు అంశాలపై పట్టు సాధించారు. మరో వైపు రాత పరీక్షకు ప్రిపరేషన్ కొనసాగిస్తున్నారు. ఇదే సమయంలో తాను నేర్చుకున్న మెలకువలను తోటి యువతకు నేర్పించాలని అనుకున్నారు. పోలీస్, ఆర్మీ, రైల్వే, సింగరేణి సెక్యూరిటీ వంటి ఉద్యోగాల కోసం సిద్ధమయ్యే వారు మైదానానికి నిత్యం పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వారంతా హేమంత్ వద్ద శిక్షణ పొందుతున్నారు. రన్నింగ్, లాంగ్ జంప్, హై జంప్, వార్మప్‌లో తాను నేర్చుకున్న మెలకువలను ఆ యువకుడు ఉద్యోగార్థులకు చెబుతున్నారు. మైదానంలో తర్ఫీదు పొందిన వారిలో 2020 నుంచి ఇప్పటి వరకు ఆర్మీ, పోలీస్, రైల్వే, సింగరేణిలో 25 మందికి పైగా ఉద్యోగాలు సాధించడం విశేషం.



"ప్రగతి మైదానం వంటి జిల్లాలోని క్రీడా స్థలాలను ఉద్యోగార్థుల సాధనకు అనువుగా తీర్చిదిద్దడంపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలి. వాకింగ్ ట్రాక్‌లు, జంపింగ్ లేక రాళ్లు కళ్లకు గుచ్చుకుంటున్నాయి. ప్రస్తుతం మా సాధనకు భూమిని జేసీబీ, రోలర్ వంటివాటి సాయంతో చదును చేయిస్తున్నాం. ఎస్సై కొలువే నా లక్ష్యం. కనీసం 300 మందైనా ఉద్యోగావకాశాలు దక్కించుకునేలా, ఫిట్‌నెస్ పరంగా సాయం అందించాలని నిర్ణయించుకున్నా." - చిట్టెం హేమంత్ కుమార్



ప్రగతి మైదానంలో ఉద్యోగార్థులతో సాధన చేయిస్తున్న హేమంత్



"మాది సుజాతనగర్ మండలం మర్రితండా. పేద కుటుంబం కావడంతో ప్రగతి మైదానానికి వచ్చి హేమంత్ దగ్గర శిక్షణ తీసుకున్నా. గతేడాది ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికై సంగారెడ్డి జిల్లాలో 9 నెలల శిక్షణ తీసుకున్నా. హేమంత్ శిక్షణ ఇచ్చే తీరు, కసరత్తు ఎంతో బాగుంటుంది. ప్రతిభ [illegible] అయ్యేలా, ఓపిగ్గా నేర్పిస్తారు. నా స్నేహితులు గణేశ్, రాజేశ్‌లు కూడా ఉద్యోగాలు సాధించడం ఆయన చలవే." - జి.వేణు

విద్యార్థులు రాణించేలా..

కాకతీయ వర్సిటీలో జరిగే అంతర కళాశాలల పోటీల్లో పాల్గొనే విద్యార్థుల ఆసక్తిని గమనించి.. వారికీ హేమంత్ మెలకువలు నేర్పుతుండటం విశేషం. ఈయన శిష్యులు ఎంతోమంది పతకాలు సాధించారు. పలు జట్లు ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచాయి. ఇటీవల వరంగల్‌లో జరిగిన కేయూ వర్సిటీ పోటీల్లో లాంగ్‌జంప్, హైజంప్, వాలీబాల్, ఖోఖోలో రాణించి 2024-మహిళా ఛాంపియన్‌గా చాతకొండ టీడబ్ల్యూఆర్ఎస్ కళాశాల విద్యార్థినులు నిలిచేందుకు హేమంత్ కూడా ఓ కారణమని చెప్పాలి.



"హేమంత్ వద్ద పరుగు పందెం, లాంగ్‌జంప్, హైజంప్‌లో శిక్షణ తీసుకున్నా. 2022లో కేయూలో జరిగిన పోటీల్లో రజతం సాధించి ఆలిండియా వర్సిటీ పోటీలకు ఎంపికయ్యా. ప్రగతి మైదానంలోని శిక్షణ ఎంతో ఆత్మవిశ్వాసాన్నిచ్చింది. రెండేళ్ల క్రితం దిల్లీలో జరిగిన ఎన్‌సీసీ ఫైరింగ్‌లో రజతం సాధించా. ఆర్మీ లేదా, ఎస్సై ఉద్యోగం నా లక్ష్యం. ఇందుకోసం శిక్షణకు తప్పకుండా హాజరవుతున్నా."

- షారుఖ్, బీఏ, రామచంద్ర డిగ్రీ కళాశాల

ఎస్సీ వర్గీకరణపై మాట తప్పిన సీఎం: మందకృష్ణ



మాట్లాడుతున్న మందకృష్ణమాదిగ

ఖానాపురం హవేలి: సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చిన రోజు శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. వర్గీకరణను దేశంలో మొదట అమలుచేసే రాష్ట్రం తెలంగాణ అని, ఆర్డినెన్స్ తీసుకొచ్చి ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఇప్పుడు మాలల ఒత్తిడికి తలొగ్గారని ఆరోపించారు. ఖమ్మంలో మాదిగల ధర్మయుద్ధ మహాసభలో శుక్రవారం మాట్లాడారు. మాదిగల వల్లే జడ్పీటీసీ సభ్యుడిగా, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీగా గెలిచానని చెప్పిన సీఎం.. కమిషన్లు, కమిటీల పేరుతో వర్గీకరణ అమలులో జాప్యం చేస్తున్నారని చెప్పారు. వర్గీకరణ అమలుచేయకుంటే రేవంత్‌రెడ్డికి రాజకీయ భవిష్యత్తు ఉండదని హెచ్చరించారు. రాష్ట్రంలో వర్గీకరణ అమలు కాకుండా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నుంచి కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వరకు సీఎంపై ఒత్తిడితెస్తున్నారని ఆరోపించారు. త్వరలో మండలాల్లో దీక్షలు, రథయాత్రలు చేస్తామని, డిసెంబరు నెలాఖరులో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ ఉంటుందని ప్రకటించారు. సమితి జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్, ఏపూరి వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ప్రసాద్, భవాని చౌదరి, నర్సయ్య, పుష్పరాజ్, సుగుణరావు పాల్గొన్నారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం భారీ ప్రదర్శనగా సభకు చేరుకున్నారు.

మధిరకు హైకోర్టు న్యాయమూర్తులు

మధిర: మధిరలో సబ్‌కోర్టు ప్రారంభంతోపాటు పాత కోర్టు ఆవరణలో కోర్టు భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొనేందుకు హైకోర్టు న్యాయమూర్తులు శుక్రవారం రాత్రి మధిర చేరుకున్నారు. తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీవెంకటేశ్వరస్వామిని న్యాయమూర్తులు జస్టిస్ పి.శ్రీసుధ, జస్టిస్ కాజా శరత్, జస్టిస్ భీమపాక నగేష్ శనివారం దర్శించుకుంటారు. అనంతరం కోర్టు భవనాలకు భూమిపూజ, తర్వాత సబ్‌కోర్టును ప్రారంభిస్తారు. వీఎస్ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో న్యాయవాదులు, పోలీసులు, ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని మధిర కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోజెడ్ల పుల్లారావు, కోర్టు భవన నిర్మాణ కమిటీ అధ్యక్షుడు కట్టా పూర్ణచంద్రరావు తెలిపారు.

మాలమహానాడు ఆధ్వర్యంలో మహా పాదయాత్ర

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: మాలల ఐక్యత కోసం ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా భద్రాచలం నుంచి హైదరాబాద్ వరకు మాలమహానాడు ఆధ్వర్యంలో చేపట్టిన మహాపాదయాత్రను శుక్రవారం ఆరంభించారు. భద్రాచలం సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించి పాదయాత్ర ప్రారంభించారు. రాజ్యాధికారమే ధ్యేయమని, వర్గీకరణతో మాలలకు ఎన్నో విధాలుగా నష్టం జరుగుతోందన్నారు. 38 రోజులు, వెయ్యి కిలోమీటర్లు, 16 జిల్లాల్లోని 35 నియోజకవర్గాల్లో యాత్ర సాగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు పిల్లి సుధాకర్ నేతృత్వంలో చేపట్టిన ఈ యాత్ర డిసెంబరు 1న హైదరాబాద్ రవీంద్రభారతిలో ముగింపుసభతో ముగుస్తుందన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేశ్, నాయకులు ఎడ్ల గణపతి, కాల్వ సుందర్‌రావు, దారా చిరంజీవి, రమణమూర్తి తదితరులు హాజరయ్యారు.



పాదయాత్రలో పిల్లి సుధాకర్, మాలమహానాడు నాయకులు

విపత్తులను ఎదుర్కోవటంలో భాజపా విఫలం

ఏన్కూరు, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా విపత్తులు, ఉపద్రవాల సమయంలో తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రజలను ఆదుకోవడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జాతీయ కమిటీ సభ్యుడు మండడపు సాయిబాబు ఆరోపించారు. ఆరికాయలపాడులో శుక్రవారం పార్టీ 9వ మండల మహాసభలో మాట్లాడారు. ఈ ఏడాది కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు అనేక చోట్ల భారీ వర్షాలకు ప్రాణ, పంటనష్టం తీవ్రంగా వాటిల్లిందని ఆ రాష్ట్రాలకు నిధులు కేటాయించడంలో భాజపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. భాజపా పాలిత రాష్ట్రాలకు మాత్రం నిధులు విడుదల చేస్తూ వివక్ష చూపుతున్నారని విమర్శించారు. రాష్ట్రాల నుంచి జీఎస్టీ, ఇతర పన్నుల పేరుతో వసూళ్లు చేస్తున్నప్పటికీ నిధులు కేటాయింపులో సమానత్వం పాటించడం లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా స్పష్టమైన విధానాలు పాటించడం లేదని, ప్రణాళికలు లేకుండా పాలన కొనసాగిస్తుందని ఆరోపించారు. ఏ సమస్యపై ప్రశ్నించినా నాటి ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసిందని సమాధానమిస్తూ దాటేస్తున్నారని, ఎన్నికల హామీలు తక్షణమే అమలు చేయాలన్నారు. ప్రారంభానికి ముందు భారీ ర్యాలీ నిర్వహించి, అమరవీరులకు నివాళి, జెండా ఆవిష్కరణ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా నాయకులు బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రంనాయక్, మెరుగు సత్యనారాయణ, దుగ్గి కృష్ణ, తాళ్లపల్లి కృష్ణ, మెరుగు రమణ తదితరులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం జాతీయ నాయకులు మండడపు సాయిబాబు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వేంసూరు: అడసర్లపాడుకు చెందిన తాటికొండ పాండురంగాచారి(44)రోడ్డు ప్రమాదంలో శుక్రవారం మృతిచెందారు. పాండురంగాచారి మర్లపాడులో తాను నిర్వహిస్తున్న ఫౌండ్రీ వద్దకు బైకుపై వస్తుండగా గ్రీన్ ఫీల్డ్ హైవే టిప్పర్ కల్లూరుగూడెం వద్ద ఢీకొంది. బైక్‌పైనున్న పాండురంగాచారి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని సత్తుపల్లికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.

గాయపడిన యువకుడు..

దుమ్ముగూడెం: చినార్లగూడెం సమీపంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు గురువారం రాత్రి మృతి చెందాడు. నారాయణరావుపేటకు చెందిన జంపన్న (21), కొమరం వీర్రాజు గురువారం ద్విచక్ర వాహనంపై వెళ్తూ అదుపుతప్పి కిందపడడంతో జంపన్న అక్కడికక్కడే మృతిచెందిన సంగతి తెలిసిందే. తీవ్రంగా గాయపడిన కొమరం వీరయ్యను(20) మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే గురువారం రాత్రి మృతి చెందారు.

మద్యం మత్తులో యాసిడ్ తాగిన వ్యక్తి..

పెనుబల్లి: మద్యం మత్తులో యాసిడ్ తాగిన వ్యక్తి మృతిచెందాడు. కేడబ్ల్యూ చౌడవరానికి చెందిన కణితి సత్యనారాయణ(45) ఈనెల 16న మద్యంతాగి ఇంటికొచ్చాడు. దాహం వేయడంతో ఇంట్లో బ్యాటరీల్లో నింపే యాసిడ్‌ను మంచినీళ్లు అనుకొని పొరపాటున తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు గమనించారు. తొలుత పెనుబల్లి వైద్యశాలకు, అక్కడి నుంచి సర్వజనాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

సీఆర్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ ఆత్మహత్య

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని సీఆర్‌పీఎఫ్ 199 బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్ పవన్‌కుమార్(38) శుక్రవారం విధులు నిర్వర్తిస్తూ తన సర్వీస్ రివాల్వర్‌తో తలపై కాల్చుకున్నాడు. పేలుడు శబ్దానికి పక్కనే ఉన్న జవాన్లు వచ్చేసరికే రక్తపు మడుగులో పడి ప్రాణాలు వదిలాడు.

బ్యాంకు చోరీకి యత్నం

కల్లూరు: కల్లూరులోని ఏపీజీవీబీలో చోరీకి దుండగులు విఫల యత్నం చేశారు. బ్యాంక్ మేనేజర్ తెలిపిన ప్రకారం.. విధి నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం బ్యాంకు తెరిచే సమయంలో షట్టర్ తాళం పగలగొట్టి ఉన్నట్టు సిబ్బంది గుర్తించారు. అనంతరం సీసీ కెమెరాలు పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలగొట్టినట్టు గుర్తించారు.

వ్యభిచార నిర్వాహకురాలికి జీవిత ఖైదు

రంగారెడ్డి జిల్లా కోర్టులు: పలువురు అమ్మాయిలను వ్యభిచార వృత్తిలోకి దింపిన మహిళకు న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు రూ.3,19,000 జరిమానా విధించింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఖమ్మంలోని గుర్రాలపాడు కాలనీకి చెందిన కుక్కల ఆశ అలియాస్ సైదాబి(25) డబ్బు వల వేసి అమ్మాయిలను కొని వ్యభిచార కూపంలోకి దింపేది. ఈ తరహాలోనే ఖమ్మం నగరానికి చెందిన ఓ మహిళ(35)ను మభ్యపెట్టి ఆమె కుమార్తె(16)ను రూ. 10వేలకు కొని ఈ వృత్తిలోకి లాగింది. వేధింపులు భరించలేక వారి చెర నుంచి తప్పించుకొని బాలిక హయత్‌నగర్ పరిధిలో ఉండే అక్క ఇంటికి చేరుకుంది. బాలిక తల్లి, ఆశ, గోపి, విజయ్, మరో బాలుడు(15) కలిసి హయత్‌నగర్‌కు వచ్చి బాధితురాలిని ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించగా స్థానిక పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేశారు. ఆశకు రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు జడ్జి హరీశ శుక్రవారం శిక్ష, జరిమానా విధిస్తూ తుది తీర్పునిచ్చారు.

అటవీ ఉద్యోగుల సిమ్‌లకు రీఛార్జి బంద్

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే




అటవీశాఖ ఉద్యోగులకు ఇచ్చిన సిమ్‌లు మూగబోయాయి. గత 8 ఏళ్ల నుంచి మనుగడలో ఉన్న నంబర్లు పని చేయక పోవడంతో వారంతా ఇబ్బంది పడుతున్నారు. చివరకు ఏ అక్రమాలు జరిగినా సమాచారం అందే పరిస్థితులు లేకుండా పోయాయి. కొంతకాలంగా చెట్ల నరికివేత, వన్యప్రాణుల వేట యథేచ్ఛగా జరుగుతున్నా కట్టడి చేయలేని దుస్థితి ఎదురవుతోంది. జిల్లాలో కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు, పాల్వంచ టెరిటోరియల్, భద్రాచలం, కిన్నెరసాని వన్యప్రాణి సంరక్షణ విభాగం డివిజన్లు ఉన్నాయి. రేంజ్‌ల సంఖ్య 21. ఉద్యోగులు 637 మంది ఉన్నారు. ఖమ్మంలో జిల్లాలో ఖమ్మం, సత్తుపల్లి డివిజన్లు, 6 రేంజ్‌ల పరిధిలో 340 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరికి గత ప్రభుత్వం సిమ్‌లు అందించింది. 'కాంపా' పథకం కింద ఎఫ్‌బీవో స్థాయి నుంచి ఎఫ్ఎస్‌వో, డీఆర్వో, రేంజర్, ఎఫ్‌డీవో, డీఎఫ్‌వోలు, సీఎఫ్, సీసీఎఫ్.. ఇలా ప్రతిస్థాయి అధికారికి సిమ్‌లు అందాయి. ఏరియాల్లో సిగ్నల్స్ పటిష్ఠంగా ఉన్న నెట్‌వర్క్‌కు ప్రాధాన్యం ఇచ్చారు. వీటికి సంబంధించి ప్రతి నెలా రూ.500 రీఛార్జ్‌ను ప్రభుత్వమే చేయిస్తోంది. రోజుకు 1.5 జీబీ ప్లాన్ వర్తిస్తోంది. డిపార్ట్‌మెంట్ పరిధిలో అందరికీ ఫ్రీ కాల్స్ చేసుకునే ప్యాకేజీలున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. ప్రభుత్వం ఆరు నెలల నుంచి రీఛార్జి చేయించడం లేదు. దీంతో అవి పనిచేయట్లేదు.

కొరవడిన సమన్వయం

ఫోన్ నంబర్లు మూగబోవడంతో అడవుల్లో అక్రమ రవాణాపై సిబ్బంది, అధికారులకు సమాచారం అందడం లేదు. గతంలో ఏదైనా అక్రమ రవాణా జరిగిన తక్షణమే స్థానిక పంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది నుంచి స్థానిక అటవీ శాఖాధికారికి సమాచారం అందించేవారు. ఈ వ్యవస్థ అందుబాటులో లేక ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం డీఎఫ్‌వో కిష్టాగౌడ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. రీఛార్జికి సంబంధించి బడ్జెట్ మంజూరు కావడం లేదన్నారు. ఇప్పటికే ప్రతిపాదనలు పంపామన్నారు.

బంగారు కవచాలతో రాములోరి దర్శనం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు కొనసాగించారు. స్వర్ణ కవచాలంకారంలో దేవదేవుడు మెరిసిపోవడంతో వీక్షించిన భక్తులు మురిసిపోయారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడికి అర్చకులు సుప్రభాతం పలికి ఆరాధించారు. క్షేత్ర విశిష్టతను ప్రవచనం చేశారు. నిత్య కల్యాణంలో భాగంగా మాంగల్యధారణ, తలంబ్రాల వేడుక నిర్వహించారు. పుష్యమి సందర్భంగా సీతారామ పట్టాభిషేకం ఘనంగా సాగింది. పుణ్య జలాలను భక్తులపై చిలకరించి అంతా శుభం కలగాలని ఆశీర్వచనం అందించారు. దర్బారు సేవ తన్మయత్వాన్ని నింపింది. శనివారం బంగారు తులసీ దళార్చన నిర్వహించనున్నారు.



ఎమ్మెల్సీ కోదండరాం పూజలు: స్వామివారిని ఆచార్య కోదండరాం శుక్రవారం దర్శించుకున్నారు. ఈఓ రమాదేవి, ఏఈఓ భవానీరామకృష్ణారావు, ఈఈ రవీంద్రనాథ్, పీఆర్వో సాయిబాబా, సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు ఆయనకు సాదర స్వాగతం పలికారు. వైదిక పెద్దలు ఆశీర్వచనం అందించారు.

ఎర్రుపాలెం మండలానికి మహర్దశ

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే



ఎర్రుపాలెం- అమరావతి- నంబూరు నూతన రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నూతనంగా నిర్మించే 57 కి.మీ. రైల్వే లైన్‌కు భూసేకరణ పనులు వేగవంతం కానున్నాయి. ఇప్పటికే ఏపీలో భూసేకరణ ప్రక్రియ పూర్తయింది. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలో వారం రోజుల్లో భూసేకరణ సర్వే మొదలుకానుంది.

57 కి.మీ. రైల్వేలైన్

ఎర్రుపాలెం నుంచి అమరావతికి రైల్వేలైన్ 2018లో మంజూరైంది. 2019లో ఏపీలో వైకాపా అధికారంలోకి వచ్చాక ఈప్రాజెక్టుపై పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శించింది. తాజాగా కూటమి ప్రభుత్వం కొలువుదీరటం, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావటంతో రైల్వేశాఖలో కదలిక వచ్చింది. ఎర్రుపాలెం- అమరావతి- నంబూరు నిర్మాణానికి 56.53 కిలోమీటర్ల రైల్వేట్రాక్ నిర్మాణానికి ఖమ్మం, కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 450 హెక్టార్ల భూమి సేకరించనున్నారు. భూసేకరణ, రైల్వేట్రాక్ నిర్మాణానికి రూ.2,245 కోట్లు ఖర్చవుతాయని రైల్వేశాఖ అంచనా వేసింది. నాలుగేళ్లలో ఈ పనులు పూర్తవుతాయని భావిస్తోంది. తెలంగాణలో ఎర్రుపాలెంలోని రైల్వేస్టేషన్ సమీపం నుంచి ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా పెద్దాపురం వరకు భూసేకరణకు ఖమ్మం జిల్లాలో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌ను నియమించింది. కొత్తపల్లి-వడ్డమాను గ్రామాల మధ్య 3.2 కి.మీ. మేర వంతెన అందుబాటులోకి రానుంది.

నూతనంగా తొమ్మిది రైల్వేస్టేషన్లు

నూతనంగా నిర్మించే రైల్వేలైన్ విజయవాడ-హైదరాబాద్ లైన్‌లోని ఎర్రుపాలెం వద్ద మొదలై అమరావతి మీదుగా నంబూరు వద్ద కలుస్తుంది. ఎర్రుపాలెం-అమరావతి రైల్వేలైన్‌లో నూతనంగా తొమ్మిది రైల్వేస్టేషన్లను నిర్మించనున్నారు. ఎర్రుపాలెం తర్వాత ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా పెద్దాపురం, చెన్నారావుపాలెం, గొట్టుముక్కల, పరిటాల, కొత్తపేట, వడ్డమాను, అమరావతి, తాడికొండ, కొప్పురావూరులో నూతన స్టేషన్లు అందుబాటులోకి వస్తాయి. ఈరైల్వేలైన్‌తో అమరావతి రాజధానికి చెన్నై, హైదరాబాద్, కోల్‌కతా అనుసంధానించనున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. నూతన రైల్వేలైన్ నిర్మాణంతో ఎర్రుపాలెం మండలానికి మహర్దశ పట్టనుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎర్రుపాలెం రైల్వేస్టేషన్ జంక్షన్‌గా మారే అవకాశముందని సంబరపడుతున్నారు.

చికెన్ ధరలు వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

భద్రాచలం

• భద్రాచలం • పినపాక • అశ్వారావుపేట

సర్వే జీఎంకు సన్మానం



సర్వే జీఎం జైనులబద్దిన్‌ను సన్మానిస్తున్న ఏరియా జీఎం రాంచందర్

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: సింగరేణిలో సుదీర్ఘకాలం పనిచేసి ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న సర్వే జీఎం జైనులబద్దిన్‌ను మణుగూరులోని జీఎం కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. జీఎం దుర్గం రాంచందర్ మాట్లాడుతూ సంస్థలో అనేక ఏరియాల్లో పలు హోదాల్లో పనిచేసిన జైనులబద్దిన్ అందరి అభిమానాన్ని పొందారన్నారు. కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, శ్యాంసుందర్, రమేష్, అనురాధ, శైలేంద్రకుమార్, శ్రీనివాస్, బాబుల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని లక్ష్మీనగరం బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి పుల్లారెడ్డి మాట్లాడుతూ అయోడిన్ లోపం వల్ల వివిధ దశల్లో కలిగే పరిణామాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయురాలు సావిత్రి, సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, ఏఎన్ఎం దుర్గాదేవి పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని డీఎస్పీ రవీంద్రారెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా



సైకిల్ ర్యాలీలో డీఎస్పీ రవీంద్రారెడ్డి, సీఐలు, ఎస్సైలు

మణుగూరులో పోలీసుశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సైకిల్‌ర్యాలీ నిర్వహించారు. పీవీ కాలనీ అడ్డరోడ్డు నుంచి అంబేడ్కర్ సెంటర్, తెలంగాణ చౌరస్తా మీదుగా ర్యాలీ కొనసాగింది. డీఎస్పీ మాట్లాడుతూ 24గంటలు విధులు నిర్వహిస్తూ జీవితాలను ప్రజలకు అంకితం చేస్తున్న పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేమన్నారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల కోసం పోలీసులు చేసిన త్యాగాలకు గౌరవం చూపడం మనందరి బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించే రక్తదానం, విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను విజయవంతం చేయాలన్నారు. మణుగూరు, అశ్వాపురం, ఏడూళ్లబయ్యారం సీఐలు సతీష్‌కుమార్, అశోక్‌రెడ్డి, వెంకటేశ్వర్లు ఎస్సైలు ప్రసాద్, రాజ్‌కుమార్, తిరుపతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యసేవల అభివృద్ధికి కృషి: గవర్నర్

సికిల్‌సెల్, థలసీమియా వార్డు ప్రారంభం

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలంలో రాములవారిని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ భవనం వద్ద గవర్నర్ నిధులు రూ. 46 లక్షలతో నిర్మించిన 20 పడకల సికిల్‌సెల్, థలసీమియా వార్డును ప్రారంభించారు. వ్యాధిగ్రస్థులను పరామర్శించి దుస్తులు అందించారు. రక్తనిధి కేంద్రాన్ని సందర్శించి అభినందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడైన గవర్నర్ మాట్లాడుతూ థలసీమియా, సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిని అరికట్టేందుకు అన్ని చర్యలు చేపడతామన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో వైద్య సేవలను అభివృద్ధి పరిచేందుకు భద్రాచలం ప్రాంతీయ వైద్యశాలను కేంద్రం నిధులతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని కోరగా గవర్నర్ సానుకూలంగా స్పందించారు. ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, రాష్ట్ర అటవీశాఖ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పొదెం వీరయ్య పాల్గొన్నారు. గవర్నర్ రాక సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఏఎస్పీ రోహిత్‌రాజ్ ఆధ్వర్యంలో ఇన్‌ఛార్జి డీఎస్పీ రవీందర్‌రెడ్డి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. లయన్ వై. సూర్యనారాయణ, డా. భానుప్రసాద్, డా. సుదర్శనరావు, డా. పి.రాజశేఖర్, డా. జయభారతి, దుర్గాప్రసాద్, అబ్రహం, జి.రాజారెడ్డి, ఎంపీఐ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



సికిల్‌సెల్, థలసీమియా వార్డును ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

గవర్నర్‌తో ముఖాముఖి..

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర గవర్నర్‌తో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ప్రముఖ సాహితీవేత్త, అంతర్జాతీయ పురస్కారగ్రహీత డాక్టర్ సిద్దాంతపు ప్రభాకరాచార్యులుకు దక్కింది. కలెక్టరేట్‌లో శుక్రవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో జిల్లాకు చెందిన ప్రముఖులతో నిర్వహించిన ముఖాముఖిలో ఆయన పాల్గొన్నారు. ప్రభాకరాచార్యులు రచించిన పుస్తకాలను గవర్నర్‌కు అందజేశారు.

చర్ల: గవర్నర్‌తో ముఖాముఖిలో చర్ల మండలం తేగడ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలు తురుమెళ్ల కళ్యాణి పాల్గొన్నారు. తన కవితల జాతీయస్థాయి హిందీ సంకలనాన్ని ఆమె అందజేశారు.

ముగిసిన పర్యటన..

బూర్గంపాడు, న్యూస్‌టుడే: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రెండు రోజుల జిల్లా పర్యటన ముగిసింది. గురువారం సాయంత్రం సారపాకలోని ఐటీసీ అతిథిగృహానికి చేరుకున్న ఆయన రాత్రి ఇక్కడే బస చేశారు. శుక్రవారం ఉదయం భద్రాచలం సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. తిరిగి ఐటీసీ అతిథి గృహానికి చేరుకుని అల్పాహారం అనంతరం కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. మరోసారి భద్రాచలం వెళ్లిన గవర్నర్ అక్కడినుంచి కొత్తగూడెం బయల్దేరి వెళ్లారు. ఆయనను పలువురు భాజపా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీలో విలీనమైన 5 గ్రామ పంచాయతీలు తెలంగాణాలో కలిసేలా చొరవ చూపాలని కోరారు. భాజపా జిల్లా మాజీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఏనుగుల వెంకటరెడ్డి, కుంజా ధర్మా, బాలునాయక్, సాయి శ్రీను, చక్రవర్తి, చుక్కపల్లి బాలాజీ ఉన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా ఎకోబ్రిక్స్ టీపాయ్



బూర్గంపాడు, న్యూస్‌టుడే: గవర్నర్ పర్యటనలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లలో పాత ప్లాస్టిక్ బాటిళ్లతో ఏర్పాటు చేసిన ఎకోబ్రిక్స్ టీపాయ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సారపాక పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ టీపాయ్ గురించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. వాడి పడేసిన ప్లాస్టిక్ సీసాలతో ఎకోబ్రిక్స్ తయారు చేసిన విధానాన్ని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ గవర్నర్‌కు వివరించారు.

వెదురు వస్తువుల స్టాల్‌లో..



చండ్రుగొండ, న్యూస్‌టుడే, చండ్రుగొండ మండలం బెండాలపాడు వెదురు వస్తువుల తయారీ కేంద్రానికి సంబంధించిన వస్తువులను కొత్తగూడెం కలెక్టరేట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన స్టాల్‌ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సందర్శించి ఆసక్తిగా పరిశీలించారు. ఈసం నాగభూషణం, బొర్రా సురేష్‌లు గవర్నర్‌కు వివరించారు. తొలుత ఆయనకు వెదురు వస్తువులతో తయారు చేసిన పుష్పగుచ్ఛాన్ని అందించారు. క్రిష్ణయ్య, అన్వేష్, శ్రీను, భద్రయ్యలు పాల్గొన్నారు.

పల్లె దవాఖానాల ప్రారంభం ఎన్నడో..?

చర్ల, న్యూస్‌టుడే



ఏడాదిగా ప్రారంభానికి నోచుకోని కుర్నపల్లి పల్లె దవాఖాన

ఐటీడీఏ పరిధిలో మారుమూల మన్యంలోని గిరిజనులకు వైద్యం మరింత చేరువ చేసేందుకు పల్లె దవాఖానాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రాథమిక వైద్య సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని గ్రామీణ ప్రజలు ఆశించారు. అయితే వాటి ప్రారంభంలో నెలకొన్న తీవ్ర జాప్యంపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. చర్ల మండలంలోని మారుమూల కుర్నపల్లి, పెదమిడిసిలేరు, మామిడిగూడెంలలో పల్లె దవాఖానాల కోసం ఒక్కో భవనాన్ని రూ.16లక్షల వ్యయంతో నిర్మించారు. ఆయా భవనాల నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. కుర్నపల్లిలో ఈ భవనం పూర్తయి ఏడాది కావొస్తున్నా ఇంతవరకు అది ప్రారంభానికి నోచుకోలేదు. మిగిలిన రెండు భవనాలదీ అదే పరిస్థితి. చిన్నపాటి పనులు పూర్తి చేసి అప్పగించాల్సి ఉన్నా వైద్యశాఖకు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు అప్పగించక ఈ సమస్య తలెత్తుతోంది.

★ ఇటీవల వర్షాలతో వాగులు పొంగడంతో మారుమూల ప్రాంతాల్లో గర్భిణులకు ప్రసవం సమయంలో అత్యవసర వైద్యం అందక జెట్టీలో మోసుకొస్తున్న దైన్య పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వం ఎంతో మంచి సంకల్పంతో ఏర్పాటు చేసిన ఈ పల్లెదవాఖానాల్లో వైద్యం అందుబాటులోకి వస్తే గ్రామీణుల చెంతకు మెరుగైన వైద్య సేవలు అందే అవకాశం ఉంది.

★ టెలీ మెడిసిన్ సేవలు సైతం వీటి ద్వారా అందుబాటులోకి వస్తే నిత్యం కీకారణ్య గ్రామాల నుంచి గర్భిణులు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని దూరాభారమైన పెద్దాసుపత్రులకు తీసుకొచ్చే జెట్టీ కష్టాలు చాలావరకు తగ్గుతాయి.

భవనాలు అప్పగించలేదు

- డాక్టర్ దివ్యనయన, సత్యనారాయణపురం పీహెచ్‌సీ వైద్యాధికారి

మాకు పల్లె దవాఖానా భవనాలను ఇంకా అప్పగించలేదు. కుర్నపల్లిలో విద్యుత్తు సమస్యతో పాటు తాగునీటి సౌకర్యం కల్పించాల్సి ఉంది. మాకు భవనాలు అప్పగిస్తే దవాఖానాల నుంచి వైద్య సేవలు ప్రారంభిస్తాం. ఈ విషయాన్ని పీవోకు విన్నవించాం.

వారంలోగా వైద్యశాఖకు అప్పగిస్తాం: శ్రీనివాస్ ఏఈ

కుర్నపల్లిలో పల్లెదవాఖానా భవనం పూర్తయింది. కిటికీలకు గ్రిల్స్ పెట్టాల్సి ఉంది. ఇక్కడ విద్యుత్తు మీటర్‌కు డబ్బు చెల్లించాం. మామిడిగూడెం, పెదమిడిసిలేరులో భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. వారంలోగా ఆయా భవనాలను సంబంధిత వైద్యశాఖకు అప్పగిస్తాం.



నిర్మించి.. సౌకర్యాలు మరిచారు!

తిప్పనపల్లి గ్రామంలో రెండు పడక గదుల ఇళ్లు నిర్మించి రెండేళ్లు కావస్తోంది. ఇప్పటి వరకు విద్యుత్తు, మంచినీటి, రహదారి, మురుగు కాలువలు నిర్మించలేదు. 30 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినా వసతులు లేకపోవడంతో వారికి స్వాధీనం చేయలేదు. పూరిళ్లు కురుస్తుండటంతో తమకు కేటాయించిన ఇళ్లలో వచ్చి ఉంటున్నామని, సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. ఎంపీడీవో బయ్యారపు అశోక్‌ని వివరణ కోరగా.. సంబంధిత శాఖాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. – చండ్రుగొండ, న్యూస్‌టుడే

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ములకలపల్లి, న్యూస్‌టుడే: ములకలపల్లిలో రహదారి విస్తరణలో భాగంగా చెట్లను నరుకుతున్న నేపథ్యంలో ములకలపల్లి విద్యుత్ ఉపకేంద్ర పరిధిలోని గ్రామాలలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ నరేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బస్టాండు పరిశీలన

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: దుమ్ముగూడెం బస్టాండును భద్రాచలం డిపో మేనేజరు తిరుపతి, తహసీల్దారు అశోక్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. బస్టాండులో వసతులను మెరుగుపరచాలని, ప్రతి బస్సు గ్రామం లోపలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు వీరి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

పశు వైద్యాధికారి బాధ్యతల స్వీకరణ

కరకగూడెం, న్యూస్‌టుడే: కరకగూడెం పశువైద్యశాలలో వైద్యాధికారి లేక పాడి రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో శుక్రవారం వరంగల్‌కు చెందిన జాటోత్ వాసంతి పశు వైద్యాధికారిగా నూతన బాధ్యతలు స్వీకరించారు.

పాదయాత్రకు స్వాగతం

బూర్గంపాడు, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రకు శుక్రవారం సారపాకలో నాయకులు స్వాగతం పలికారు. సారపాకలో అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండలంలో పాదయాత్ర కొనసాగింది. మాల మహానాడు మండలాధ్యక్షుడు తుమ్మల కిరణ్‌కుమార్, లాలయ్య, అనిల్, సుదర్శన్, కొనకంచి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'మునగ సాగు లాభదాయకం'

గుండాల, న్యూస్‌టుడే: మునగ సాగుతో అధిక లాభాలు పొందాలని ఏఓ వెంకటరమణ అన్నారు. శుక్రవారం కాచనపల్లి పంచాయతీ కార్యాలయంలో రైతులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఒక్కో మొక్కకు 10 మీటర్ల దూరం ఉండేలా మునగ మొక్కలు నాటాలన్నారు. అంతర పంటలుగా పత్తి, మొక్కజొన్న, కంది, పెసర పంటలు వేసుకోవచ్చన్నారు. తేనెటీగల పెంపకం, పామాయిల్ సాగు, పండ్లజాతి పంటలపై దృష్టి సారించాలని సూచించారు.

విద్యార్థుల అభ్యున్నతికి సమష్టి కృషి అవసరం

చర్ల, న్యూస్‌టుడే: విద్యార్థుల అభ్యున్నతికి తల్లిదండ్రులతో పాటు అధ్యాపకులు సమష్టి కృషి చేయాలని చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధానాచార్యుడు ఎన్.నరేందర్ సూచించారు. కళాశాలలో శుక్రవారం వృత్తివిద్యకు సంబంధించిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు.

పరివర్తన యశోద ఫౌండేషన్ సేవా సమితి వితరణ

భద్రాచలం పట్టణం: పరివర్తన యశోద ఫౌండేషన్ సేవాసమితి ఆధ్వర్యంలో వృద్ధులకు, దివ్యాంగులకు బియ్యం, నిత్యావసరాలు శుక్రవారం పంపిణీ చేశారు. డాక్టర్ భానుప్రసాద్ దంపతులు, బిర్రు సుధాకర్, కొమ్మగిరి వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సీఎం సహాయ నిధి చెక్కులను తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం పొందిన వారు ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయగా వారికి చెక్కులు మంజూరయ్యాయి. భగవాన్‌దాస్ కాలనీ చెందిన వెంకటేశ్వర్లుకు రూ.45 వేలు, రాముకు రూ.45 వేలు, రిక్షా కాలనీకి చెందిన ఉపేందర్‌కు రూ.60 వేలు చెక్కులను అందజేశారు.

భద్రాచలంలో కోదండరాం పర్యటన

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: విశ్రాంత ప్రిన్సిపల్, తెజస నాయకుడు తిప్పన సిద్దులును ఎమ్మెల్సీ ఆచార్య కోదండరాం శుక్రవారం భద్రాచలంలో పరామర్శించారు. సిద్దులు ఇటీవల జారిపడి అనారోగ్యానికి గురయ్యారు. దీంతో భద్రాచలం వచ్చిన కోదండరామ్ సిద్దులు నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యం, విద్యను బలోపేతం చేసేందుకు కృషి చేస్తోందన్నారు. తన దృష్టికి వచ్చిన పలు సమస్యలు త్వరలో ముఖ్యమంత్రికి తెలిపి పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం కోదండరాంను సిద్దులు సన్మానించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కోదండరాం మార్నింగ్ వాక్ చేశారు. స్థానిక గిరిజన బాలికల సంక్షేమ గురుకులానికి వెళ్లి అక్కడ విద్యార్థులతో మాట్లాడి వారితో కలిసి అల్పాహారం చేశారు. అక్కడి సమస్యలను పాఠశాల కమిటీ తెల్లం నరేశ్ ఆయన దృష్టికి తెచ్చారు. పాకాల దుర్గాప్రసాద్, చల్లగుళ్ల నాగేశ్వరరావు, శంకర్‌రావు, ప్రదీప్ కుమార్ నాయకులు పాల్గొన్నారు.



కోదండరాంను సన్మానించిన సిద్దులు, పాకాల దుర్గాప్రసాద్

బూర్గంపాడు, న్యూస్‌టుడే: భద్రాచలం పర్యటనకు వచ్చిన ఎమ్మెల్సీ ఆచార్య కోదండరాంను కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సారపాకలోని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారం వెంకటేశ్వరరెడ్డి నివాసంలో శుక్రవారం ఆయనను కలిశారు. స్థానిక పరిస్థితులను ఆయనకు వివరించారు. దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, మహమ్మద్‌ఖాన్, గోనె రామారావు, యారం పిచ్చిరెడ్డి, గోనె దారుగ, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చల్లా వెంకటనారాయణ, రామారావు తదితరులు ఉన్నారు.



కళతప్పిన వివేకానంద కూడలి..!

నిన్నటివరకూ పచ్చని చెట్లతో ఉన్న అశ్వారావుపేటలోని వివేకానంద కూడలి నేడు వెలవెలబోతోంది. ఈ కూడలిలో ఇటీవలి వరకు పలువురు వాహనదారులు కాసేపు విశ్రాంతి తీసుకునేవారు. ద్విచక్ర వాహనాలు, కార్లు ఆ చెట్ల నీడన పెట్టి మధ్యాహ్న సమయంలో సేద తీరేవారు. ఆ భారీ వృక్షాలు నేడు రహదారి విస్తరణ, మురుగునీటి కాలువల నిర్మాణంలో ఆనవాళ్లు కోల్పోయాయి. చెట్లు కనుమరుగు అయ్యాయి. పాత ఎంపీడీఓ కార్యాలయం సమీప భారీ వృక్షాలనూ పొక్లెయిన్‌తో తొలగించడంతో ఆ ప్రాంతం అంతా బోసిపోయినట్లుగా తయారైంది.

– అశ్వారావుపేట, న్యూస్‌టుడే

ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం: పాయం

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: అన్నివర్గాల ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరులోని విప్పలసింగారంలో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం గ్రామస్థుల నుంచి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాలను పాయం స్వీకరించారు. తహసీల్దారు రాఘవరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, మండల అధికారులు పాల్గొన్నారు.



గ్రామస్థుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పాయం

'రామాచారి పోరాట స్ఫూర్తి ఆదర్శం': రామాచారి పోరాట స్ఫూర్తి ఎంతోమందికి ఆదర్శమని పినపాక, కొత్తగూడెం ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, కూనంనేని సాంబశివరావు అన్నారు. మణుగూరులోని రామానుజవరంలో శుక్రవారం నిర్వహించిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు బొల్లోజు అయోధ్య సోదరుడు రామాచారి సంతాప సభలో వారు మాట్లాడారు. పలు ఉద్యమాల్లో అయోధ్యకు మద్దతుగా ఉంటూ రామాచారి చేసిన పోరాటలు మరువలేనివన్నారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సాబిర్ పాషా, అన్నవరపు కనకయ్య, నెల్లూరి నాగేశ్వరరావు, నారాయణ, రాంబాబు, కుర్రి నాగేశ్వరరావు, లక్ష్మీకుమారి, పుల్లారెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెరటి కోళ్లు.. నష్టం మిగిల్చాయి..!

చండ్రుగొండ, న్యూస్‌టుడే

గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా మహిళాశక్తి పథకం కింద పెరటికోళ్ల పెంపకం పథకం ఆదిలోనే హంసపాదులా తయారైంది. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు చేపట్టిన పెరటికోళ్ల పెంపకం పథకం లక్ష్యం నెరవేరకుండానే మహిళలు ఆర్థికంగా నష్టపోతున్నారు. చండ్రుగొండ మండలంలోని 14 పంచాయతీల్లో 90 యూనిట్ల పెరటికోళ్ల పెంపకం చేపట్టాలని లక్ష్యం నిర్దేశించారు. ఈ పథకం కింద మండలంలో 20 యూనిట్లు అందించారు. ఒక్కో యూనిట్ ధర రూ.5,500. నెల రోజుల కిందట ఒక్కో యూనిట్‌కు 50 కోడిపిల్లలు ఇచ్చారు. ఒక్కో కోడిపిల్ల ఇంటికి చేరేలా రవాణా ఖర్చుతో సహా రూ.110 పడింది. వంకనెంబర్‌లో 3, బెండాలపాడు 3, తిప్పనపల్లి 5, మద్దుకూరు 5, అయ్యన్నపాలెం 4 యూనిట్లు ఇచ్చారు. వీటిలోని 16 యూనిట్లలో ఒకటి రెండు కోడిపిల్లలు మినహా దాదాపు అన్నీ మృతిచెందాయి. కోడి పిల్లలకు వైరస్ సోకి మృత్యువాత పడ్డాయని లబ్ధిదారులు వాపోతున్నారు. ఏపీఎంకు వారు సమాచారం ఇచ్చారు. వీరు కోడిపిల్లల కోసం తీసుకున్న రుణం రూ.5,500లు నెలకు రూ.500 చొప్పున 12నెలలు చెల్లించాల్సి ఉంది. తీసుకున్న కోడిపిల్లలు మృతి చెందాయని, అప్పు ఎలా తీర్చాలని యూనిట్లు పొందిన మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలని ఎంపీడీవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. తిప్పనపల్లిలో తాను తీసుకున్న 50 కోడిపిల్లల్లో ఒక్కటే మిగిలిందని లబ్ధిదారు నైమున్ వాపోయారు.



తిప్పనపల్లిలో 50 కోడిపిల్లలకు ఒక్కటే మిగిలిందని చూపుతున్న నైమున్



ముడగదీసుకుని మృతి చెందేలా ఉన్న కోడిపిల్ల

★ దీనిపై ఐకేపీ ఏపీఎం సంతోష్‌ని వివరణ ఇస్తూ కోడిపిల్లలు సరఫరా చేసిన సిద్దిపేటకు చెందిన వ్యాపారికి తెలియజేశామని, చనిపోయిన కోడిపిల్లలకు సంబంధించి ఫొటోలు పెడితే వాటిలో 50 శాతం కోడిపిల్లలు ఇస్తానని అంటున్నారని ఆయన తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
భద్రాచలం: 79950 67029
అశ్వారావుపేట: 80085 73696
పినపాక: 91212 29033

సమస్య: చూరుబాక గ్రామ శివారులో చెట్ల కొమ్మలు కిందపడి ఉండటంతో స్థానికుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. **గ్రామస్థులు**

సమాధానం: వెంటనే వీటిని తొలగించి స్థానికులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతాం. **ఉబ్బా శ్వేత, పంచాయతీ కార్యదర్శి**

- దుమ్ముగూడెం, న్యూస్‌టుడే

✆ ములకలపల్లి పీహెచ్‌సీ కార్యాలయ సమీపంలో వీధి దీపాలు వెలగడంలేదు. మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించాలి.

- రమ్య, గృహిణి, ములకలపల్లి

✔ మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం. **రవి, పంచాయతీ కార్యదర్శి, ములకలపల్లి**

- ములకలపల్లి, న్యూస్‌టుడే

✆ పేదలకు రాయితీపై అందించే విద్యుత్తు మీటరుకు దరఖాస్తు చేసి అనంతరం సంబంధిత అధికారులకు నగదు చెల్లించాం. ఇంత వరకు మీటరు రాలేదు.

- సారమ్మ, ఏడూళ్లబయ్యారం

✔ నగదు చెల్లించిన రశీదును పరిశీలించి మీటరు అందజేసేలా చర్యలు తీసుకుంటాం.

- వీరారెడ్డి, ఏడూళ్లబయ్యారం విద్యుత్తు ఉపకేంద్రం సబ్ ఇంజినీర్

- పినపాక, న్యూస్‌టుడే

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు మృతి

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కుంటాల్ తోంగ్ అటవీ ప్రాంతంలో మావోయిస్టు దళాలు- భద్రతా బలగాల మధ్య శుక్రవారం ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ఓ మావోయిస్టు మృతి చెందగా.. మరో ఐదుగురు తీవ్ర గాయాలతో పారిపోయినట్లు పోలీస్ అధికారులు భావిస్తున్నారు.

ఆరుగురు లొంగుబాటు: సుక్మా జిల్లాలో ఆరుగురు మావోయిస్టులు ఎస్పీ కిరణ్‌చౌహాన్ సమక్షంలో శుక్రవారం లొంగిపోయారు. బండు, పవన్, కుంజం రోషన్, దస్రు, మహిళా మావోయిస్టులు కమల, సుశీల వీరంతా కొన్నేళ్లుగా మావోయిస్టు ఉద్యమంలో పని చేస్తున్నారు. ఉద్యమంపై విరక్తి చెంది పోలీస్ అధికారుల ఎదుట లొంగిపోయారు.

పరస్పర దాడులు

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మణుగూరులోని సాంబాయిగూడెంలో నిర్వహిస్తున్న ఓ ఇసుక స్టోరేజ్ యార్డ్‌కు సంబంధించి శుక్రవారం ఇరువర్గాల మధ్య పరస్పర దాడులు జరిగాయి. గోదావరి తీరప్రాంతంలో ఇసుక లోడుతో ప్రయాణించే లారీలపై పట్టాలు కప్పే విషయంలో పినపాక మండలం పోతిరెడ్డిపల్లి సొసైటీ సభ్యులకు, సాంబాయిగూడెం గ్రామస్థులకు మధ్య వాగ్వాదం నెలకొంది. పట్టాలు కప్పే పని తమకు కావాలంటే, తమకు కావాలని సొసైటీ సభ్యులతో పాటు స్టోరేజ్ యార్డ్ ఏర్పాటుచేసిన భూమికి సంబంధించిన వ్యక్తులు ఘర్షణకు దిగి పరస్పర దాడులు చేసుకున్నారు. కాగా. . ఈ విషయంపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు

ములకలపల్లి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత గతనెల 28న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. బంధువులు, తెలిసినవారింట వెతికినా ఆమె ఆచూకి లభించలేదు. ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

బోదనెల్లి అడవుల్లో టేకు కలప పట్టివేత

చర్ల, న్యూస్‌టుడే: చర్ల మండలం దుమ్ముగూడెం అటవీ రేంజి పరిధిలోని బోదనెల్లి బీట్‌లో దాచి ఉంచిన 15 టేకు దిమ్మెలను అటవీశాఖ సిబ్బంది శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడి అడవిలో టేకు దిమ్మెలు ఉన్నాయనే సమాచారంతో అటవీ క్షేత్రాధికారి కమల ఆదేశాలతో సిబ్బంది ఈ టేకు దిమ్మెలను స్వాధీనం చేసుకొని భద్రాచలం అడితీకి పంపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రేంజి అధికారి తెలిపారు. పట్టుకున్న కలప విలువ దాదాపు రూ.2లక్షల వరకు ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

'రైతులను మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వం'

దమ్మపేట, న్యూస్‌టుడే: రైతు రుణమాఫీ, రైతు భరోసా అంశంలో తెలంగాణ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని రైతు సంఘం జిల్లా నాయకుడు దొడ్డా లక్ష్మీనారాయణ ధ్వజమెత్తారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల హామీ మేరకు రైతులందరికీ రూ.2లక్షల రుణ మాఫీ, వానాకాలం పంటకు ఎకరాకు రూ.7,500 రైతు భరోసా నగదును వారి ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. మోరంపూడి శ్రీనివాసరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ గ్రంథాలయం.. తెరిస్తేనే ఉపయోగం

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే

మణుగూరు సమితిసింగారం పరిధిలోని అగ్నిమాపక శాఖ కార్యాలయం సమీపంలో నిర్మించిన డిజిటల్ గ్రంథాలయం నేటి వరకు ప్రారంభానికి నోచుకోలేదు. అక్కడ ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్మించిన ట్రైబల్ కమ్యూనిటీ హాల్‌లోని రెండో అంతస్తులో పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రూ. 15 లక్షల డీఎంఎఫ్‌టీ గ్రాంటుతో డిజిటల్ గ్రంథాలయాన్ని ప్రారంభించడానికి గత సంవత్సరమే శంకుస్థాపన చేశారు. కమ్యూనిటీహాల్ పైభవనంలో అత్యాధునిక సాంకేతికతతో కూడిన కంప్యూటర్లను ఏర్పాటు చేసి డిజిటల్ గ్రంథాలయాన్ని ప్రారంభించాలని సంకల్పించారు. కానీ నాటి నుంచి నేటి వరకు ఎటువంటి పనులు ఆరంభించలేదు. పైగా కమ్యూనిటీహాల్‌ను కూడా ఎటువంటి కార్యక్రమాలకు వినియోగించకపోవడంతో విపరీతంగా పిచ్చిమొక్కలు పెరిగి నిర్మానుష్య భవనంగా మారింది. స్థానిక యువత అధిక శాతం ఉద్యోగాల అన్వేషణను అవసరమైన పుస్తక పఠనానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిరోజుల క్రితం ముత్యాలమ్మనగర్‌లోని ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శాఖ గ్రంథాలయం పట్టణానికి దూరంగా ఉండటంతో యువత అక్కడకు వెళ్లేందుకు అంత ఆసక్తి చూపడం లేదు. ఈ సమయంలో ఇక్కడున్న డిజిటల్ గ్రంథాలయాన్ని పూర్తిస్థాయిలో ప్రారంభిస్తే యువతతోపాటు విద్యార్థులు అధిక శాతం అక్కడకు వచ్చేందుకు ఆసక్తి చూపుతారు. ఈ విషయమై ఐటీడీఏ డీఈ మధుకర్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా... వివరాలు సేకరించి పరిశీలిస్తామన్నారు.



పిచ్చిమొక్కలతో నిర్మానుష్యంగా దర్శనమిస్తున్న గిరిజన సామాజిక భవనం

కొత్తగూడెం

• కొత్తగూడెం • ఇల్లెందు

వాసవీక్లబ్ వితరణ



టై, బెల్టులు అందజేస్తున్న కొత్తగూడెం వాసవీక్లబ్ సభ్యులు

టేకులపల్లి, న్యూస్‌టుడే: బొమ్మనపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కొత్తగూడెం వాసవీక్లబ్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. కాంప్లెక్స్ హెచ్.ఎం. మంగీలాల్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్మన్ పి.లక్ష్మి, వాసవీక్లబ్ కొత్తగూడెం అధ్యక్షుడు శ్యామ్‌గోపాల్, ప్రధాన కార్యదర్శి వల్లాల మణిదీప్, జిల్లా ప్రోగ్రాం అధికారి ఫణీంద్రకుమార్, దత్తుప్రసాద్, లోగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని డిమాండ్

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: కార్మికులకు వేతనాలు పెంచాలని, వాటిని సకాలంలో ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా సమావేశం శుక్రవారం మంచికంటిభవన్‌లో జరిగింది. ఏజే రమేష్, బ్రహ్మచారి, పద్మ, శ్రీను, అర్జున్, వీరన్న, సత్య, దుర్గమ్మ, భూక్యా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కొత్తగూడెం: 8008573723
పాల్వంచ: 9550076766
ఇల్లెందు: 9154846689



సమస్య: పాల్వంచ టీచర్స్‌కాలనీ డ్రైనేజీలో పూడిక తీయడం లేదు. మురుగునీరు పారకపోవడంతో దుర్వాసన వస్తోంది. **- విజయ్, స్థానికుడు**

సమాధానం: స్థానిక జవాన్‌కు ఆదేశించి డ్రైనేజీ శుభ్రం చేయిస్తాం.
- కేవీ లక్ష్మణ్‌రావు, పారిశుద్ధ్య అధికారి
– పాల్వంచ, న్యూస్‌టుడే

పీఎస్సార్ ట్రస్ట్ కబడ్డీ పోటీలకు ఆహ్వానం

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా పీఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 28న కొత్తగూడెంలో నిర్వహించే కబడ్డీ పోటీలకు హాజరుకావాలని సభ్యులు శుక్రవారం కలెక్టర్ జితేశ్ వి పాటిల్, అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన (స్థానిక సంస్థలు)లకు కలెక్టరేట్‌లో ఆహ్వాన పత్రిక అందజేశారు. సంఘం అధ్యక్షుడు కార్తిక్, డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాస్‌రావు, ఆళ్ల మురళి, వీరహనుమంతరావు, దేవీప్రసన్న పాల్గొన్నారు.

సుఖవ్యాధులపై అవగాహన

జూలూరుపాడు, న్యూస్‌టుడే: తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా సుఖవ్యాధులు సోకకుండా చూసుకోవచ్చని జూలూరుపాడు వైద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో జూలూరుపాడు పీహెచ్‌సీలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ కావేరి మాట్లాడుతూ సురక్షితంకాని లైంగిక సంబంధాలు, రక్తమార్పిడి, కలుషిత సూదిమందు తదితర కారణాలతో ఒకరి నుంచి మరొకరికి సోకే ప్రమాదం ఉందన్నారు. వైద్య సిబ్బంది రత్నకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'సామాజిక తనిఖీ ప్రజావేదిక'

టేకులపల్లి, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై 'సామాజిక తనిఖీ' ప్రజా వేదికను ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శనివారం 10 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రవీందర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.4.70 కోట్లతో చేపట్టిన 575 పనులు, రూ.27 లక్షల మెటీరియల్ నిర్వహణపై తనిఖీ జరుగుతుందని చెప్పారు.

'ఆన్‌లైన్ పెట్టుబడి యాప్' బాధితుల ఏకరవు?

సుజాతనగర్, న్యూస్‌టుడే: అధిక లాభాల ఆశతో ఆన్‌లైన్ యాప్‌లో పెట్టుబడి రూ.25 లక్షల మేర నష్టపోయామంటూ మండలానికి చెందిన సుమారు 50 మంది బాధితులు సుజాతనగర్ పోలీసుల వద్ద శుక్రవారం గోడు వెళ్లబోసుకున్నట్లు సమాచారం. రాఘవాపురానికి చెందిన ఓ వ్యక్తి సూచనతో రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టినట్లు లబోదిబోమన్నారు. ఎస్సై జుబేదాబేగం 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. బాధితులు ఇంకా ఫిర్యాదు చేయలేదన్నారు. సైబర్ నేరంపై విచారణ చేస్తామన్నారు.

'పోలీసు ఉద్యోగులకు తప్పని నిరీక్షణ'

కొత్తగూడెం పట్టణం: ప్రభుత్వం మారినా పోలీసు ఉద్యోగుల వెతలు తీరలేదని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.కామేశ్ అన్నారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ టీఏ, డీఏ, పీఆర్సీ ఎరియర్స్, జీపీఎఫ్ వంటివాటికి రెండున్నరేళ్ల నుంచి నిరీక్షణ తప్పడం లేదన్నారు.

డీలర్లు.. నూతన సాగు వారధులు



కొత్తగూడెం వ్యవసాయం, టేకులపల్లి న్యూస్‌టుడే

వ్యవసాయంలో సంప్రదాయ పద్ధతులు రైతుల్ని నష్టాలపాల్జేస్తున్నాయి. ఈ క్రమంలో వారికి అధునాతన సాగు పద్ధతులు, సాంకేతిక విధానాలు దరిచేర్చడంలో స్థానిక పురుగు మందులు, ఎరువుల దుకాణాల డీలర్లు కీలకపాత్ర పోషిస్తున్నారు. అన్నదాతలకు మేలైన సాగు విధానాలపై అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇన్‌పుట్ డీలర్లను వారధులుగా మార్చుతోంది. నూతన వంగడాలు, విత్తన ఎంపిక, చీడపీడల నివారణ, సేంద్రియ సాగు, భూసార పరీక్షలు, సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాల్లో 'దేశీ' శిక్షణలో నిష్ణాతులుగా తీర్చిదిద్దుతోంది. తాజాగా జిల్లాలో ఏడో బ్యాచ్ శిక్షణ పూర్తిచేసుకోగా.. పలువురిని 'న్యూస్‌టుడే' పలకరించింది. ఆ విశేషాలు..

క్షేత్రస్థాయి సందర్శనలకు మరింత ప్రాధాన్యం: – డేవిడ్ జయపాల్‌రావు, విశ్రాంత సహాయ వ్యవసాయ సంచాలకులు, ఫెసిలిటేటర్



కేంద్ర ప్రభుత్వం డీలర్లకు దేశీ శిక్షణలను 2003 నుంచి ప్రారంభించగా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2018 నుంచి కార్యక్రమాలు మొదలయ్యాయి. వ్యవసాయ విస్తరణ, ఆధునిక అంశాలకు సంబంధించి ముఖ్యాంశాలను 48 వారాల (తరగతులు, క్షేత్ర సందర్శన) శిక్షణలో ఒక్కో బ్యాచ్‌కు 40 మంది చొప్పున నేర్పిస్తున్నాం. తాజాగా ఏడో బ్యాచ్ శిక్షణ పూర్తిచేసుకుంది. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు, కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, ఉద్యాన, వ్యవసాయ, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు తర్ఫీదు ఇస్తారు. పది ఉత్తీర్ణత సాధించి దేశీ శిక్షణ పూర్తిచేస్తే పురుగు మందుల వ్యాపార లైసెన్స్ పొందొచ్చు.

సాంకేతికతే రైతుకు వెన్నుదన్ను
– బి.వెంకటరామారావు, భద్రాచలం



సాంకేతికంగా రైతుకు ఏ సాయం అందించాలో పలువురు నిపుణులు వివరించారు. రైతు బాగుండాలంటే ఏఏ సలహాలు, సూచనలు అందించాలో అర్థమయ్యేలా విశదీకరించారు. పచ్చిరొట్ట, జీలుగులను పూత దశలో భూమిలో కలియదున్నడం, జీవన ఎరువుల వాడకంతో ఎన్నో లాభాలున్నాయి. రసాయనాలు, యూరియా వాడకాన్ని తగ్గించడంపై అవగాహన కలిగింది.

సేంద్రియ సాగు లాభదాయకం
– బి.వెంకట సుబ్బారావు, ఆళ్లపల్లి మండలం



సేంద్రియ వ్యవసాయంతో వాతావరణ కాలుష్యాన్ని ఎలా తగ్గించాలో శిక్షణలో నేర్చుకున్నా. ఇక్రిశాట్‌తో పాటు వ్యవసాయ విశ్వ విద్యాలయం, జిల్లాలోని పలు పంట క్షేత్రాలను సందర్శించాం. అధునాతన సాగు విధానాలు, మేలైన వంగడాల ఎంపిక గురించి రైతులకు నేర్చుకున్న అంశాలు తెలుపుతా.

నేల సారాన్ని కాపాడుకునేలా చైతన్యం: – తేరాల రమేశ్‌బాబు, బోడు, టేకులపల్లి మండలం



గ్రామీణ ప్రాంతాల రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి భూసారాన్ని ఎలా కాపాడుకోవాలో వివరిస్తాను. సేంద్రియ వ్యవసాయమే విధానమే లక్ష్యంగా ముందుకు సాగుతాం. నేల సారం పెంచడం, వైవిధ్య పంటలు పండించడం, మెరుగైన మార్కెటింగ్‌పై శాస్త్రవేత్తలు, అధికారులు ఏఏ విషయాలు చెప్పారో.. అవన్నీ రైతులకు అందిస్తాం.

ఉద్యాన, కూరగాయల పంటల సాగు మేలు..
– బొప్పన సుబ్బారావు, కొప్పురాయి, టేకులపల్లి మండలం



కల్తీ, ప్రమాదకర ఎరువులు, పురుగు మందుల వాడకం నేల సారాన్ని కోల్పోయేలా చేస్తుందని శాస్త్రవేత్తలు వివరించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించే ఉద్యాన పంటల దిశగా మెట్ట రైతులను ప్రోత్సహిస్తాను. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఆధునిక వ్యవసాయం రైతులకు ఎంతో మేలు చేస్తుంది. మేం గమనించిన అంశాలను అన్నదాతలకు చేరవేస్తాం.

అంధకారాన్ని పారదోలారు!

స్పందనకు వందనం



పురపాలకం పరిధిలోని 16వ వార్డు న్యూ గొల్లగూడెంలో వీధిదీపాన్ని శుక్రవారం సాయంత్రం సిబ్బంది ఏర్పాటు చేశారు. స్థానికంగా అంధకారం నెలకొంటున్న వైనాన్ని స్థానికులు 'ఈనాడు' 'మేమున్నాం.. మీతోడుగా' శీర్షిక ద్వారా ఈ నెల 22న అధికారులకు తెలిపారు. స్పందించిన వార్డు కౌన్సిలర్ మాచర్ల రాజకుమారి విద్యుత్తు సిబ్బందిని పిలిపించి వీధిదీపాన్ని ఏర్పాటు చేయించారు.
– కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

28న కలెక్టరేట్ ముట్టడి

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: రైతుల సమస్యలపై ఈ నెల 28న కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, జిల్లా అధ్యక్షుడు చంద్ర నరేంద్రకుమార్ తెలిపారు. ఏఐకేఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం శేషగిరిభవన్‌లో ఏర్పాటైంది. ఎన్నికల గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందన్నారు. సమావేశంలో ఏపూరి బ్రహ్మం, సలిగంటి శ్రీను, గుగులోతు రాంచందర్, నరాటి రమేష్, రవి, రోశయ్య, భిక్షం, వాడే లక్ష్మి పాల్గొన్నారు.

కూడలిలో గుంతలు.. ప్రయాణ అవస్థలు



పాల్వంచ దమ్మపేట సెంటర్ కూడలిలో రోడ్డు మధ్య భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో తరచూ వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి. స్పందించిన స్థానికులు గుంతల వద్ద ఇలా ప్రమాద సూచిక ఏర్పాటు చేశారు. సమస్యను 'న్యూస్‌టుడే' ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ప్రమాదకర గుంతలకు తాత్కాలిక మరమ్మతులతో పూడ్చివేస్తామని చెప్పారు.
– పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే

అమరుల త్యాగాలకు గుర్తుగా రక్తదానం



పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా చాతకొండ ఆరవ బెటాలియన్‌లో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సిబ్బంది 45 మంది స్వచ్ఛంద రక్తదానం చేశారు. అదనపు కమాండెంట్ ఎ.అంజయ్య, అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాసరావు, బెటాలియన్ యూనిట్ ఆసుపత్రి వైద్యాధికారి డా.బాబురావు, ఆర్.ఐ. శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.
– కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

అంటించేది వారే.. ఆర్పేదీ వారే!



ఇల్లెందు పట్టణంలో సేకరించిన చెత్తను స్థానిక ఓసీకి వెళ్లేమార్గంలో కొన్నాళ్లుగా డంప్ చేస్తున్నారు. అక్కడ గుట్టలుగా పేరుకునే నిల్వలకు కొందరు సిబ్బంది నిప్పంటిస్తుండగా.. సమీప లలితాపురం గ్రామాన్ని పొగ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. పలు అనారోగ్య సమస్యల బారినపడుతున్నట్లు వారు వాపోతున్నారు. యార్డును తరలించాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని శుక్రవారం చెత్త వాహనాలను అడ్డుకున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ అక్కడకు చేరుకుని ట్యాంకర్ సాయంతో చెత్తకుప్పల మంటలను ఆర్పించేశారు. – ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

విశ్వశాంతికి హనుమాన్ చాలీసా పారాయణం రేపు

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: విశ్వశాంతిని కాంక్షిస్తూ ఆదివారం ఉ.6 గంటల నుంచి విద్యానగర్‌కాలనీలోని మాస్టర్ ఇ.కె విద్యాలయంలో హనుమాన్ చాలీసా విరాట్ పారాయణం, ఆదిత్య హృదయ, విష్ణు, లలితా సహస్ర నామస్తోత్ర పారాయణాలను నిర్వహిస్తున్నట్లు హనుమత్ సేవా సమితి సభ్యులు జె.చిరంజీవిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాస్టర్ ఇ.కె. ఆధ్యాత్మిక సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి పట్టణం, పరిసర మండలాల భక్తులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

లెనిన్ సిద్ధాంతాలు అనుసరణీయం: కెచ్చల



మాట్లాడుతున్న కెచ్చల రంగారెడ్డి, చిత్రంలో గుమ్మడి నర్సయ్య, చంద్ర అరుణ తదితరులు

కొత్తగూడెం సింగరేణి: రష్యా విప్లవం విజయవంతంతో లెనిన్ మార్గం అనుసరణీయమైనదని సీపీఐ ఎంఎస్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కెచ్చల రంగారెడ్డి అన్నారు. లెనిన్ శత జయంతిని పురస్కరించుకుని ముద్దా భిక్షం అధ్యక్షతన శుక్రవారం స్థానికంగా ఏర్పాటైన సదస్సులో ఆయన ప్రసంగించారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, రాష్ట్ర నాయకులు చంద్ర అరుణ, కెచ్చల కల్పన, మాచర్ల సత్యం, ప్రభాకర్, మధుసూదన్‌రెడ్డి, భాస్కర్, గోపాలరావు, ధర్మా పాల్గొన్నారు.

చోరీకి వచ్చిన పాత దొంగ అరెస్ట్

చౌటుప్పల్ గ్రామీణం, న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల్లో చోరీలు చేస్తున్న దొంగ యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పోలీసులకు శుక్రవారం చిక్కాడు. సీఐ మన్మథకుమార్ కథనం ప్రకారం.. జూలూరుపాడు ఎస్సీ కాలనీకి చెందిన కారం నరేష్(35) తాళం వేసిన ఇళ్లల్లో ద్విచక్రవాహనాలు అపహరిస్తుంటాడు. ఆయనపై పలు స్టేషన్లలో 15 చోరీ కేసులున్నాయి. నేరాలు అంగీకరించడంతో అతణ్ని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్టు పోలీస్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



ఆకట్టుకున్న అటవీ ఉత్పత్తులు

జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్‌కు శుక్రవారం వచ్చిన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ.. అటవీ శాఖ ఉత్పత్తుల వివరాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. మరో స్టాల్‌లో ఔషధ మొక్కల విశిష్టతలను వివరంగా అడిగారు. జిల్లా అటవీ ప్రాంత విశేషాలను కలెక్టర్ జితేశ్ వి పాటిల్ గవర్నర్‌కు వివరించారు. – కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే

త్వరలో ముర్రేడు రక్షణ గోడ పనులు ప్రారంభం: కూనంనేని



పంచాయతీ కార్యాలయ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలంలో పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. శ్రీనగర్, ఎదురుగడ్డ, గౌండ్ల రామవరంలో రూ.29 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, రూ.20 లక్షలతో నిర్మించిన శ్రీనగర్ పంచాయతీ నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి ప్రసంగించారు. ముర్రేడు వాగు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో చలపతిరావు, పీఆర్ డీఈ రామకృష్ణ, ఎంపీవో శ్రీనివాస్, ఏఈ శివలాల్, ఏఈ వెంకటస్వామి, నాయకులు సాబీర్‌పాషా, కంచర్ల చంద్రశేఖర్‌రావు, తాళ్లూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అందరికీ ప్రభుత్వ విద్యే లక్ష్యం: అలుగుబెల్లి

పాల్వంచ, న్యూస్‌టుడే: పాల్వంచలోని విద్యాలయాల్లో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. స్థానిక కేజీబీవీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్సీ గురుకులం, గిరిజన బాలుర ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిశారు. నవంబరు 6 వరకు ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. తనకు మొదటి ప్రాధాన్యం ఓటు వేయాలని అర్థించారు. టీఎస్ యూటీఎఫ్ బలపరిచిన ఉపాధ్యాయ, అధ్యాపకుల ఉమ్మడి అభ్యర్థిగా ప్రభుత్వ విద్యా రంగం పరిరక్షణకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అందరికీ ప్రభుత్వ విద్య అందించడమే లక్ష్యం అన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కిషోర్‌సింగ్, కృష్ణ, జిల్లా కార్యదర్శి మల్లెంపాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కేజీబీవీలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

వేడుకల భవనం తాళం పగలగొట్టిన లీజుదారుడు

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: పెద్దమ్మతల్లి ఆలయ ఆవరణలోని 700 సీటింగ్ సామర్థ్యం గల వేడుకల భవనం లీజు హక్కులను గత ఏడాది డిసెంబరులో బి.హరీష్ అనే వ్యక్తి పొందారు. రెండో విడత అద్దెను చెల్లించకపోవడంతో ఈవో రజనీకుమారి నోటీసులు జారీ చేసి లీజు ఒప్పందాన్ని రద్దు చేశారు. లీజుదారుడు అధికారులకు ఏ సమాచారం ఇవ్వకుండా వేడుకల భవనం తాళాలు పగలగొట్టడంతో ఈవో ఆయనపై పాల్వంచ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు భవనం వద్దకు చేరుకున్నారు. హరీష్‌తో మాట్లాడుతూ.. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

ఒప్పంద కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: ఒప్పంద కార్మికుల సమస్యలను శాసన మండలిలో ప్రస్తావిస్తానని ఎమ్మెల్సీ ఆచార్య కోదండరాం అన్నారు. రుద్రంపూర్‌లో సింగరేణి కాంట్రాక్టు కార్మికులతో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేతన పెంపు, జీవో 22 అమలు, ఉద్యోగాల క్రమబద్ధీకరణ తదితర అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కాంట్రాక్టు కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రాసూరి శంకర్, ఉపాధ్యక్షుడు గూడెల్లి యాకయ్య, ప్రధానకార్యదర్శి మేడిపల్లి కరుణాకర్, నాయకులు సాదిక్, అనిల్, సమ్మయ్య, ప్రసాద్, షకీల్, లత, రాంబాయి, మల్లెల రామనాథం పాల్గొన్నారు.

పాల్వంచ పట్టణం: ప్రొ.ఎం.కోదండరాంను డీసీఎంఎస్ ఛైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు సన్మానించారు. జగన్నాథపురంలోని పెద్దమ్మతల్లి ఆలయాన్ని దర్శించుకుని అమ్మవారికి శుక్రవారం పూజలు చేశారు.



మాట్లాడుతున్న కోదండరాం, చిత్రంలో రామనాథం, శంకర్, యాకయ్య తదితరులు

బస్ షెల్టర్ల ఏర్పాటుకు సింగరేణి సహకారం

జూలూరుపాడు, న్యూస్‌టుడే: జూలూరుపాడులో ప్రధాన రహదారికి ఇరువైపులా సింగరేణి సంస్థ సహకారంతో రెండు బస్ షెల్టర్లను ఏర్పాటు చేసేందుకు రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఆ సంస్థ ఏజీఎం(సీఓ) రామకృష్ణ తెలిపారు. ఆయన శుక్రవారం పంచాయతీరాజ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి షెల్టర్లు ఏర్పాటు చేయాల్సిన ప్రదేశాలను పరిశీలించారు. వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్‌నాయక్ సమస్యను అధికారుల దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు మంగీలాల్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బస్‌షెల్టర్ల ఏర్పాటు చేసే స్థలాల పరిశీలనకు వచ్చిన ఏజీఎం(సీఓ) రామకృష్ణ, ఇంజనీరింగ్ సిబ్బంది

జిల్లాలో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సేవలు విస్తృతం



మొక్క నాటుతున్న మొబైల్ టవర్ ఇన్‌ఛార్జి తారాచంద్

టేకులపల్లి, న్యూస్‌టుడే: బీఎస్ఎన్ఎల్ సంస్థ నెట్‌వర్క్‌ను ఎప్పటికప్పుడు విస్తృతపరిచి వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తామని టెలికాం విభాగం తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మొబైల్ టవర్ ఇన్‌ఛార్జి అధికారి, సీసీఏ (కంట్రోలర్, కమ్యునికేషన్ అకౌంట్స్) ఎస్.తారాచంద్ అన్నారు. ఆయన మండలంలో శుక్రవారం పర్యటించారు. జిల్లాలో బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ సేవలు, మొబైల్ సిగ్నళ్ల పనితీరు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. టేకులపల్లి పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్‌రావు, పంచాయతీ కార్యదర్శి ఉప్పు దీప్తి, మాజీ సర్పంచి సరిత, బీఎస్ఎన్ఎల్ కొత్తగూడెం సబ్ డివిజనల్ ఇంజినీర్ బానోత్ సక్రునాయక్, అధికారులు సుధీర్, బాలాజీ, అశోక్, ఉదయ్, శివరాంజీ పాల్గొన్నారు.

ఆదర్శ విపణి.. త్వరలో అందుబాటులోకి..

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

ఇల్లెందు పురపాలక ప్రజలకు కూరగాయలు, నిత్యావసరాలు వంటివి అన్నీ ఒకేచోట లభించేలా ఆదర్శ (మోడల్) మార్కెట్‌ను నిర్మిస్తున్నారు. పనులు దాదాపు పూర్తికావచ్చాయి. తుది మెరుగులు దిద్ది రెండు వారాల్లోగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే కోరం కనకయ్యల చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

బొగ్గుట్ట ప్రాంత ప్రజల అవసరాలను తీర్చేందుకు అన్ని హంగులతో మోడల్ మార్కెట్‌ను నిర్మించాలని పురపాలక వర్గం నిర్ణయించింది. ఈ మేరకు రూ.8 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులను వెచ్చించింది. నిధుల మంజూరుతో 2019లో మార్కెట్ పనులను గుత్తేదారు ప్రారంభించారు. మొత్తం రెండు అంతస్తులు, నాలుగు బ్లాకుల్లో మార్కెట్ నిర్మించాలన్నది ప్రణాళిక. కింది అంతస్తులో 96, పైన అంతే సంఖ్యలో గదులు నిర్మిస్తున్నారు. మొత్తం 192 గదులు అందుబాటులోకి రానున్నాయి. ఐదేళ్లుగా కొనసాగుతున్న పనులు ఎట్టకేలకు పూర్తికావొచ్చాయి. ప్రధాన భవనంతో పాటు రహదారి, మరుగుదొడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు అదనంగా మరో రూ.50 లక్షలను పురపాలకం వెచ్చించింది. ఈ పనులు దాదాపు పూర్తికావచ్చాయి. ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న మార్కెట్ త్వరలో అందుబాటులోకి తేనున్నారు.



కాలువ పనులను పరిశీలిస్తున్న పురపాలక ఛైర్మన్ డీవీ

✦ "ఎండలు, వానలకు రోడ్ల వెంట ఇబ్బందులు పడుతున్న కూరగాయలు, పండ్లు, మాంసం విక్రయాల చిరు వ్యాపారుల కష్టాలు తీరనున్నాయి. మార్కెట్ పూర్తవగానే వారికి దుకాణాలు కేటాయించనున్నాం. మరుగుదొడ్లు, కాలువల నిర్మాణ అదనపు పనుల పూర్తికి ఆదేశించాం. తాజా పురోగతిని స్వయంగా పరిశీలించాను".
– డి.వెంకటేశ్వరరావు, పురపాలక ఛైర్మన్